ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక

MHR TV

మెదక్ సంపుటి: 19 సంచిక : 175 సోమవారం 02, మార్చి 2026 పేజీలు: 06 వెల: రూ.1

Circulated By: Hyderabad-Medak-Sangareddy-Nalgonda-Warangal-Nizamabad-Adilabad -Vijayawada-Guntur-Vizag-Kurnool | www.prajaswaramdaily.com

## ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ దుర్మరణం

**అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్త దాడుల్లో మృతి**
**అధికారికంగా వెల్లడించిన ఇరాన్**
**దాడిలో ఖమేనీ కుమార్తె కుటుంబం మృతి**
**ప్రపంచ వ్యాప్తంగా సంచలనంగా మారిన ఘటన**
**పలు దేశాల్లో సంబరాలు.. కొన్ని చోట్ల నిరసనలు**
**కొత్త ఇరాన్ సుప్రీం లీడర్‌గా అయతొల్లా అలీ రెజా అరాఫీ**




## విదేశాంగ విధానంలో మోడీ విఫలం

**భారత్ ప్రయోజనాలకు ద్రోహం**
**అంతర్జాతీయ అంశాల్లో మౌనం సరికాదు**
**కాంగ్రెస్ సీనియర్ నేత జై రాం రమేశ్**
**కేంద్ర ప్రభుత్వ విధానాలపై ఆగ్రహం**
**భారత్ నైతికత దెబ్బతీస్తున్నారని మండిపాటు**
**దేశానికి స్పష్టత లేకుండా వ్యవహరిస్తున్నారని విమర్శలు**




## గల్ఫ్ ప్రాంతాల్లో తెలుగు ప్రజలకు

# సీఎం అలర్ట్

### అప్రమత్తంగా ఉండాలన్న సీఎం రేవంత్ రెడ్డి

**అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దని సూచన**
**భద్రతా మార్గదర్శకాలు పాటించాలన్న సీఎం**
**రాయబార కార్యాలయాలతో సమన్వయం ముఖ్యం**
**గల్ఫ్ దేశాల్లో పరిస్థితిపై రాష్ట్ర ప్రభుత్వ నిఘా**



**ప్రజాస్వరం, హైదరాబాద్**

పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో గల్ఫ్ దేశాలు, ఇరాన్ ప్రాంతాల్లో ఉన్న తెలుగువారు అత్యంత జాగ్రత్తగా ఉండాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. యుద్ధం కొనసాగుతున్నట్లు వస్తున్న వార్తల దృష్ట్యా భద్రతా మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని కోరారు. ఆయా దేశాల్లోని భారత రాయబార కార్యాలయాలు జారీ చేసే సూచనలు, హెచ్చరికలను నిరంతరం గమనించాలని తెలిపారు.

**పరిస్థితిపై రాష్ట్ర ప్రభుత్వం నిఘా**

ఇరాన్, ఇజ్రాయెల్ సహా ఇతర గల్ఫ్ దేశాల్లో నివసిస్తున్న తెలంగాణ ప్రజల పరిస్థితిని రాష్ట్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నదని సీఎం తెలిపారు. అత్యవసర పరిస్థితులు తలెత్తితే వారిని సురక్షితంగా స్వదేశానికి రప్పించేందుకు కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకుంటామని స్పష్టం చేశారు. అవసరమైతే తక్షణ చర్యలు తీసుకునేందుకు అధికారులను సిద్ధంగా ఉండాలని ఆదేశించినట్లు వెల్లడించారు. ఆయా దేశాల్లోని భారత ఎంబసీలు, కాన్సులేట్లతో నిరంతర సంప్రదింపులు

మిగతా 2లో..



## అభివృద్ధికి అడ్డంకిగా మారిన


# కాంగ్రెస్

### పుదుచ్చేరి సభలో ప్రధాని నరేంద్ర మోడీ

**అభివృద్ధి డబుల్ ఇంజిన్ బలం ఇస్తామని హామీ**
**మదురైలో రూ.4 వేల కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన**
**కాంగ్రెస్ పాలనపై మోడీ తీవ్ర విమర్శలు**
**కేంద్ర అభివృద్ధి పనులపై కీలక వ్యాఖ్యలు**
**కేంద్ర బడ్జెట్‌లో మౌలిక వసతులకు రూ.12 లక్షలు**
**ఆయుష్మాన్ భారత్‌తో కోట్లాది మందికి మేలు**
**పుదుచ్చేరిని పర్యాటకంగా అభివృద్ధి చేస్తామన్న మోడీ**

**ప్రజాస్వరం, పుదుచ్చేరి**

పుదుచ్చేరి అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ అడ్డంకిగా మారిందని ప్రధాన మంత్రి నరేంర్ర మోడీ విమర్శించారు. గతంలో కాంగ్రెస్-డీఎంకే పాలనలో అవినీతి, నేరాలు, రాజకీయ అస్థిరత పెరిగాయని ఆరోపించారు. ఆ కాలంలో పేదల సమస్యలను పట్టించుకోలేదని మండిపడ్డారు. ప్రస్తుతం కేంద్రం, యూటీ ప్రభుత్వం కలిసి పనిచేయడం వల్ల పుదుచ్చేరి వేగంగా అభివృద్ధి దిశగా సాగుతోందని చెప్పారు.పుదుచ్చేరిలో ఆదివారం జరిగిన భారీ సభలో మాట్లాడిన మోదీ, "ఉత్తమ పుదుచ్చేరి" లక్ష్యంతో ముందుకు వెళ్తున్నామని తెలిపారు. ఉత్తమం అంటే వ్యాపారం, విద్య, ఆధ్యాత్మికత, పర్యాటకం వంటి అన్ని రంగాల్లో ముందుండాలని ఆయన వివరించారు. గత నాలుగున్నరేళ్లలో ఆ దిశగా స్పష్టమైన మార్పు కనిపిస్తోందన్నారు. కేంద్రం, పుదుచ్చేరి ప్రభుత్వం ఒకే ఆలోచనతో పనిచేస్తే ఫలితాలు మరింత మెరుగ్గా వస్తాయని చెప్పారు. పుదుచ్చేరి గొప్ప సంస్కృతి, ఆధ్యాత్మిక



మిగతా 2లో..



## ఖమ్మంలో గడ్డపార రాజ్యం

**రియల్ ఎస్టేట్ వ్యాపారుల కోసమే పేదల ఇళ్ల కూల్చివేత**
**రాష్ట్రంలో ఉన్నది ప్రజా వ్యతిరేక ప్రభుత్వం**
**బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు**
**వెలుగుమట్ల ప్రాంతం పరిశీలన**

**ప్రజాస్వరం, హైదరాబాద్**

రాష్ట్రంలో ఉన్నది ప్రజా వ్యతిరేక ప్రభుత్వం అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు దుయ్యబట్టారు. ఆదివారం ఖమ్మం జిల్లా పర్యటనలో భాగంగా వెలుగుమట్ల ప్రాంతంలో ఆశ్రయం కోల్పోయిన బాధితులను పరామర్శించారు. గత వారం రోజుల నుంచి ఖమ్మంలోని భూదాన్ భూమి నిర్వాసితుల ఆక్రందన యావత్ తెలంగాణతో పాటు దేశవ్యాప్తంగా ప్రతిధ్వనిస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది ప్రజల సంక్షేమం కోసం పని చేసే ప్రభుత్వం ఏమాత్రం కాదని, పూర్తిగా ప్రజా వ్యతిరేక ప్రభుత్వమని ధ్వజమెత్తారు. రియల్ ఎస్టేట్ వ్యాపారుల ప్రయోజనాల కోసమే నిరు పేదల ఇళ్లను దౌర్జన్యంగా కూల్చివేసిందని

మిగతా 2లో..

## మరో బాణసంచా కర్మాగారంలో

# భారీ పేలుడు



### 17 మంది మృతి.. మరో 13 మందికి గాయాలు

**మహారాష్ట్రలో నాగ్‌పూర్‌లో దుర్ఘటన**
**ప్రమాద సమయంలో భవనంలో 30 మంది**
**ఘటనపై దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన సీఎం**
**సమగ్ర దర్యాప్తు జరపాలని ఆదేశాలు**
**మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల పరిహారం**

**ప్రజాస్వరం, నాగ్‌పూర్**

మహారాష్ట్రలో భారీ విషాదం చోటుచేసుకుంది. నాగపూర్ సమీపంలోని కటోల్ ప్రాంతంలో ఉన్న బాణాసంచా కర్మాగారంలో ఆదివారం ఉదయం భారీ పేలుడు సంభవించింది. ఈ దుర్ఘటనలో 17 మంది కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. మరో 18 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఒక్కసారిగా సంభవించిన ఈ పేలుడుతో భవనం పూర్తిగా కూలిపోయి శిథిలాలుగా మారింది.ప్రమాద సమయంలో కర్మాగారంలో సుమారు 30 మందికి పైగా కార్మికులు పని చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఆకస్మికంగా పేలుడు సంభవించడంతో భవనం ఒక్కసారిగా కూలిపోవడంతో పలువురు లోపలే చిక్కుకుపోయారు. స్థానికులు సమాచారం ఇవ్వడంతో అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించారు.మొదట 15 మంది మృతి చెందినట్లు సమాచారం వచ్చినప్పటికీ, తర్వాత మృతుల సంఖ్య 17కు పెరిగినట్లు అధికారులు ధృవీకరించారు. ఇంకా శిథిలాల కింద మరికొందరు చిక్కుకుపోయి ఉండొచ్చని అనుమానం వ్యక్తమవుతోంది. అందుకే శోధన చర్యలు ఆపకుండా కొనసాగిస్తున్నారు. గాయపడిన వారిని సమీప ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. కొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ఈ ఘటనపై మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్

మిగతా 2లో..



## మూసీ బాధితులకు అండగా బీఆర్ఎస్

**రాష్ట్రంలో బుల్డోజర్ రాజ్యం**
**మూసీ పేరిట స్కాం**
**బాధిత కుటుంబాలకు బెదిరింపులు ఆపాలి**
**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

**ప్రజాస్వరం, హైదరాబాద్**

మూసీ బాధితుల కోసం బీఆర్ఎస్ పార్టీ అన్ని రకాలుగా అండగా ఉంటుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ భరోసా ఇచ్చారు. తెలంగాణలో కాంగ్రెస్ బుల్డోజర్ రాజ్యం నడుస్తున్నదని మండిపడ్డారు. హైదరాబాద్‌లో మూసీ ప్రాజెక్టులో భాగంగా ఇళ్లను, భూములను, అపార్ట్‌మెంట్లను కోల్పోతున్న రాజేంద్రనగర్ ప్రాంతంలోని హైదర్ షా కోట్, మధు పార్క్ రిడ్జ్ అపార్ట్‌మెంట్

మిగతా 2లో..

# అభివృద్ధికి అడ్డంకిగా మారిన కాంగ్రెస్

**మొదటిపేజీ తరువాయి**



వారసత్వానికి నిలయం అని మోదీ కొనియాడారు. మహాకవి సుబ్రమణ్య భారతి ఇక్కడి నుంచే జాతీయ భావజాలాన్ని ప్రజల్లో నింపారని గుర్తుచేశారు. అలాగే శ్రీ అరబిందో ప్రపంచానికి కొత్త ఆధ్యాత్మిక దృక్పథాన్ని అందించారని పేర్కొన్నారు. ఈ భూమిలో ఉండటం గౌరవంగా ఉందని అన్నారు.

ఈ ఏడాది కేంద్ర బడ్జెట్‌లో మౌలిక వసతుల కోసం రూ.12 లక్షల కోట్ల రికార్డు కేటాయింపులు చేశామని మోదీ తెలిపారు. దీని వల్ల పుదుచ్చేరికి కూడా లాభం చేకూరుతుందని చెప్పారు. ఇంతకుముందు రాష్ట్రాలకు మాత్రమే వర్తించిన మూలధన పెట్టుబడి పథకాన్ని ఇప్పుడు పుదుచ్చేరికి కూడా అందుబాటులోకి తెచ్చామని వెల్లడించారు. మంచి రోడ్లు, తాగునీరు, తీర ప్రాంత అభివృద్ధి, పాఠశాలలు, ఆస్పత్రులు వంటి రంగాల్లో భారీ పెట్టుబడులు పెడుతున్నామని చెప్పారు. ఇవి ప్రజల రోజువారీ జీవితాన్ని మెరుగుపరుస్తాయని తెలిపారు. డబుల్ ఇంజిన్ సర్కార్ వల్ల పుదుచ్చేరి తలసరి ఆదాయం పెరిగిందని మోదీ పేర్కొన్నారు. ఉన్నత విద్యా రంగంలోనూ అభివృద్ధి జరుగుతోందన్నారు. పాండిచ్చేరి విశ్వవిద్యాలయంలో కొత్త లెక్చర్ హాళ్లు, బాలికల హాస్టల్ వంటి సదుపాయాలు ఏర్పాటు చేశామని తెలిపారు. విద్యార్థులకు ఇది ఉపయోగకరంగా ఉంటుందని చెప్పారు.

ఆరోగ్య రంగంలో కేంద్రం అమలు చేస్తున్న ఆయుష్మాన్ భారత్ పథకం ద్వారా కోట్లాది కుటుంబాలు లాభపడుతున్నాయని చెప్పారు. పుదుచ్చేరి వైద్య పర్యాటక కేంద్రంగా ఎదగగలదని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇప్పటికే తొమ్మిది వైద్య కళాశాలలు ఉన్నాయని గుర్తు చేశారు. అలాగే పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెడితే కాలుష్యం తగ్గుతుందని అభిప్రాయపడ్డారు.గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో మౌలిక వసతులను బలోపేతం చేస్తున్నామని మోదీ స్పష్టం చేశారు. విద్యార్థులు, రైతులు, వ్యాపారులకు ఉపయోగపడేలా వందల కిలోమీటర్ల గ్రామీణ రహదారులు నిర్మాణంలో ఉన్నాయని తెలిపారు. పట్టణ రద్దీ తగ్గించేందుకు రూ.140 కోట్లతో ఫ్లై ఓవర్ నిర్మించామని చెప్పారు. అదనంగా రూ.1,000 కోట్ల విలువైన కొత్త ప్రాజెక్టులను ప్రకటించారు. మొత్తం రూ.2,700 కోట్ల అభివృద్ధి పనులను ప్రారంభించి జాతికి అంకితం చేసినట్లు వెల్లడించారు.

పుదుచ్చేరి ఇప్పటికే దేశవ్యాప్తంగా పర్యాటకులకు ఆకర్షణగా మారిందని మోదీ అన్నారు. వీకెండ్ టూర్లకు పెద్ద సంఖ్యలో ప్రజలు ఇక్కడికి వస్తున్నారని చెప్పారు. ఆధ్యాత్మిక, పర్యావరణ, పర్యాటక రంగాల్లో మరింత పెట్టుబడులు వస్తే ఈ ప్రాంతం కొత్త స్థాయికి చేరుకుంటుందని అభిప్రాయపడ్డారు.ఇక తమిళనాడులో జరిగిన మరో కార్యక్రమంలో కూడా మోదీ అభివృద్ధి అంశాలపై మాట్లాడారు. 2047 నాటికి అభివృద్ధి చెందిన భారత్ లక్ష్యంగా దేశం ముందుకు సాగుతోందన్నారు. ఈ లక్ష్య సాధనలో తమిళనాడు కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. మదురైలో రూ.4,000 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన అనంతరం ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

రైల్వే రంగంలో గత దశాబ్దంలో పెద్ద మార్పులు వచ్చాయని మోదీ తెలిపారు. తమిళనాడుకు రైల్వే బడ్జెట్‌ను గణనీయంగా పెంచామని చెప్పారు. 2009-14 మధ్య రూ.880 కోట్లు కేటాయించగా, 2026-27లో ఒక్క ఏడాదికే రూ.7,600 కోట్లు కేటాయించినట్లు వివరించారు. సుమారు 1,300 కిలోమీటర్ల కొత్త రైల్వే లైన్లు వేసినట్లు చెప్పారు. 97 శాతం మార్గాల్లో విద్యుద్దీకరణ పూర్తి చేశామని పేర్కొన్నారు. అనేక అండర్‌పాస్‌లు, ఫ్లైఓవర్లు నిర్మించామని తెలిపారు.జాతీయ రహదారుల అభివృద్ధిలోనూ తమిళనాడు ముందంజలో ఉందని చెప్పారు. 2014 తర్వాత 4,000 కిలోమీటర్లకు పైగా జాతీయ రహదారులు నిర్మించామని గుర్తు చేశారు. రవాణా సదుపాయాలు మెరుగుపడితే పరిశ్రమలు, పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని వివరించారు.

బెంగళూరు-చెన్నై, చెన్నై-హైదరాబాద్ బుల్లెట్ ట్రైన్ కారిడార్ల ప్రకటన ప్రాంతీయ ఆర్థిక వ్యవస్థకు కొత్త దిశ చూపుతుందని మోదీ అభిప్రాయపడ్డారు. వేగవంతమైన రవాణా ద్వారా వ్యాపారం, పరిశ్రమలు మరింత వేగంగా అభివృద్ధి చెందుతాయని తెలిపారు. పుదుచ్చేరి, తమిళనాడులో అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా కొనసాగుతున్నాయని ప్రధాని పేర్కొన్నారు. కేంద్రం, రాష్ట్రం కలిసి పనిచేస్తే ప్రజలకు ప్రత్యక్ష లాభం చేకూరుతుందని చెప్పారు. ప్రజల సహకారంతో 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దుతామని ధీమా వ్యక్తం చేశారు.

# మూసీ బాధితులకు అండగా బీఆర్ఎస్

**మొదటిపేజీ తరువాయి**

బాధితులను ఆదివారం కలిసి వారికి సంఘీభావం తెలిపారు. మూసీ బాధితుల కోసం వారు నిర్వహించిన 'మూసీ దండి మార్చ్' పాదయాత్రలో మూడున్నర కిలోమీటర్ల పాటు బాధితులను కలుస్తూ కేటీఆర్ ముందుకు సాగారు. ఆ తర్వాత మధు పార్క్ రిడ్జ్ అపార్ట్‌మెంట్ దగ్గర జరిగిన సమావేశంలో మాట్లాడారు. రెండు సంవత్సరాల పాటు మూసీ బాధితులు తమ భూములను, అపార్ట్‌మెంట్లను కాపాడుకునేందుకు ప్రయత్నం చేయాలని, ఈ పోరాటంలో బీఆర్ఎస్ అండగా ఉంటుందని, తిరిగి కేసీఆర్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎవరి భూములు, ఇళ్లు పోకుండా చూస్తామని హామీ ఇచ్చారు.

**అటు దేశంలో.. ఇటు రాష్ట్రంలో..**

ఒకవైపు దేశంలో బీజేపీ బుల్డోజర్ రాజ్యం చేస్తున్నది అంటూ కాంగ్రెస్ పార్టీ నేత రాహుల్ గాంధీతో పాటు మిగిలిన నేతలంతా చెబుతుంటే, తెలంగాణలో జరుగుతున్న బుల్డోజర్ రాజ్యాన్ని ఆపకుండా మౌనంగా ఉంటున్నారని కేటీఆర్ మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి తెలిసిన పాలన కేవలం ఇండ్లను కూలగొట్టడం, భూములు ఆక్రమించడం, రియల్ ఎస్టేట్ దందా చేయడం, దానికోసం పేదల జీవితాలను పూర్తిగా నాశనం చేయడమే అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల ఇళ్లను కూలగొట్టి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయడమే పనిగా పెట్టుకున్నారన్నారు. రెండేళ్లలో ఒక ప్రాజెక్ట్ గానీ, ఒక ఇల్లు గానీ, ఒక రోడ్డు గానీ వేయకుండా కేవలం విధ్వంసమే తమ విధానంగా పెట్టుకుని ముందుకు పోతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అపార్ట్‌మెంట్ వాసులు, కుటుంబ సభ్యులు ప్రతి ఒక్కరూ ఎన్ని రకాలుగా ప్రభుత్వానికి విజ్ఞప్తులు చేసినా, చివరికి పసిపాపల పట్ల కనికరం చూపాలని కోరినా కర్కశంగా ఇళ్లను ఖాళీ చేయిస్తూ, బెదిరింపులకు దిగుతూ విధ్వంసానికి పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో ఇళ్లను కూలగొట్టడమే పనిగా పెట్టుకున్నదని ఆరోపించారు. అధికారంలోకి రాగానే హైడ్రా పేరుతో వందల మంది ఇళ్లు కూలగొట్టారని, అటు రామగుండం, మహబూబ్ నగర్, ఖమ్మం వంటి ప్రాంతాల్లో ప్రతి ఒక్కరికీ ఇబ్బంది కలిగేలా, వారి జీవితాలను చిన్నాభిన్నం చేసేలా చేస్తున్నారని కేటీఆర్ మండిపడ్డారు.



# గల్ఫ్ ప్రాంతాల్లో తెలుగు ప్రజలకు సీఎం అలర్ట్

**మొదటిపేజీ తరువాయి**

కొనసాగించాలని కూడా సూచించారు. తెలంగాణ ప్రజల భద్రతే తమ ప్రభుత్వానికి ప్రథమ ప్రాధాన్యమని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

**అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దు**

ప్రస్తుతం పరిస్థితులు ఉద్రిక్తంగా ఉన్నందున అత్యవసరం అయితే తప్ప ఎవరూ బయటకు రావొద్దని సీఎం సూచించారు. స్థానిక ప్రభుత్వాలు, భారత రాయబార కార్యాలయాలు జారీ చేసే సూచనలను ఖచ్చితంగా పాటించాలని కోరారు. ప్రతి ఒక్కరూ సురక్షిత ప్రదేశాల్లో ఉండాలని విజ్ఞప్తి చేశారు.

**కేంద్రానికి విజ్ఞప్తి చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్**

ఇదే సమయంలో రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ కేంద్ర ప్రభుత్వానికి కీలక విజ్ఞప్తి చేశారు. గల్ఫ్ దేశాల్లో పెద్ద సంఖ్యలో తెలంగాణ ప్రజలు ఉన్నారని, యుద్ధ పరిస్థితుల దృష్ట్యా వారికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా కేంద్రం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. ఏవైనా సమస్యలు తలెత్తితే తెలంగాణ ఎన్ఆర్ఐ అడ్వైజరీ కమిటీ ద్వారా ప్రభుత్వ దృష్టికి తీసుకురావాలని సూచించారు. కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో అవసరమైతే ప్రత్యేక విమానాలు ఏర్పాటు చేసి ప్రజలను రప్పిస్తామని భరోసా ఇచ్చారు.

**బహ్రెయిన్‌లో 50 వేల మందికి పైగా ఏపీ వాసులు**

మరోవైపు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ప్రజల భద్రతపై కూడా ఆ రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. ఏపీ శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు బహ్రెయిన్‌లో ఉన్న తెలుగువారి పరిస్థితిపై ఆరా తీశారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సుమారు 50 వేల మంది వరకు బహ్రెయిన్‌లో వివిధ రంగాల్లో పనిచేస్తున్నారని సమాచారం.

ప్రత్యేకంగా నర్సీపట్నం పరిసర ప్రాంతాలకు చెందిన అనేక మంది ఉపాధి కోసం అక్కడికి వెళ్లినట్లు తెలుస్తోంది. ఎన్నారై ప్రతినిధి శెట్టి సతీష్‌తో ఫోన్‌లో మాట్లాడి అక్కడి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. బహ్రెయిన్‌లో ఉన్న తెలుగువారు అప్రమత్తంగా ఉండాలని, స్థానిక అధికారుల సూచనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఏదైనా అత్యవసర పరిస్థితి తలెత్తితే ఏపీఎన్ఆర్టీ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం సహాయం అందిస్తుందని స్పష్టం చేశారు.

**గల్ఫ్‌లో తెలుగు ప్రజల ఆందోళన**

గల్ఫ్ దేశాల్లో లక్షలాది మంది తెలుగువారు వివిధ రంగాల్లో పనిచేస్తున్నారు. నిర్మాణ రంగం, వైద్య రంగం, సేవారంగాల్లో ఎక్కువమంది ఉపాధి పొందుతున్నారు. ప్రస్తుతం గగనతల పరిమితులు, విమాన రద్దులు, భద్రతా హెచ్చరికల కారణంగా వారు ఆందోళనకు గురవుతున్నారు. ఇరాన్-ఇజ్రాయెల్ ఘర్షణల నేపథ్యంలో ప్రాంతీయ ఉద్రిక్తతలు పెరగడంతో పలు దేశాలు అప్రమత్తమయ్యాయి. ఈ ప్రభావం అక్కడి భారతీయులపై కూడా పడే అవకాశం ఉండటంతో రాష్ట్ర ప్రభుత్వాలు ముందస్తు చర్యలు తీసుకుంటున్నాయి.

**ఎంబసీలతో నిరంతర సంప్రదింపులు**

తెలంగాణ ప్రభుత్వం భారత విదేశాంగ శాఖతో పాటు గల్ఫ్ దేశాల్లోని ఎంబసీలతో సంప్రదింపులు కొనసాగిస్తున్నట్లు తెలిసింది. అవసరమైతే హెల్ప్‌లైన్ నంబర్లు ఏర్పాటు చేసి, సమాచారం సేకరించేందుకు ప్రత్యేక సెల్ ఏర్పాటు చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు వర్గాలు తెలిపాయి. అలాగే, కుటుంబ సభ్యులు ఆందోళన చెందకుండా అధికారిక సమాచారం మాత్రమే నమ్మాలని ప్రభుత్వం సూచించింది. సోషల్ మీడియాలో వస్తున్న వదంతులను నమ్మవద్దని హెచ్చరించింది.

**ముందస్తు చర్యలు కీలకం**

ప్రస్తుతం పరిస్థితులు మారుతూ ఉండటంతో ఏ క్షణంలోనైనా పరిణామాలు మారే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. అందువల్ల విదేశాల్లో ఉన్న తెలుగువారు స్థానిక చట్టాలు, భద్రతా సూచనలు ఖచ్చితంగా పాటించాల్సిన



అవసరం ఉందని అధికారులు సూచిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అవసరమైతే ప్రత్యేక నియంత్రణ గది ఏర్పాటు చేసి సమన్వయం చేస్తామని సంకేతాలు ఇచ్చింది. ప్రజలు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొన్నా ప్రభుత్వానికి తెలియజేయాలని కోరింది. గల్ఫ్ ప్రాంతాల్లో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు అప్రమత్తమయ్యాయి. విదేశాల్లో ఉన్న తమ రాష్ట్ర ప్రజల భద్రతే ప్రథమ కర్తవ్యమని స్పష్టం చేస్తున్నాయి. పరిస్థితులను నిరంతరం గమనిస్తూ అవసరమైన చర్యలు తీసుకుంటామని ప్రభుత్వాలు భరోసా ఇస్తున్నాయి.

# ఖమ్మంలో గడ్డపార రాజ్యం

**మొదటిపేజీ తరువాయి**

మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం కనీస కనికరం లేకుండా ఇళ్లను నేలమట్టం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉన్నత న్యాయస్థానం యథాతథ స్థితి కొనసాగించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినప్పటికీ పట్టించుకోలేదని ఆరోపించారు. పత్రాలు అసలైనవి కావని సాకులు చెబుతూ పేదల ఇళ్లపై భారీ యంత్రాలను ప్రయోగించారని రాంచందర్ రావు మండిపడ్డారు. అనంతరం ఖమ్మం నగరంలోని అంబేద్కర్ భవనంలో తలదాచుకున్న బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఈ కష్ట కాలంలో బీజేపీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అధికార వర్గాలకు అత్యంత సన్నిహితులైన రియల్టర్లకు ఆ భూములను కట్టబెట్టేందుకే దాడులు చేశారని విమర్శించారు. భారతీయ జనతా పార్టీ ఎల్లప్పుడూ అణగారిన వర్గాల పక్షాన నిలబడుతుందని చెప్పారు. బాధితులకు ప్రభుత్వమే సొంత ఖర్చులతో పక్కా ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. వారికి సంపూర్ణ న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగుతుందని, ఈ విషయంలో వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. స్థానిక ప్రజలతో కలిసి భారీ ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు, రాష్ట్ర కోశాధికారి దేవకి వాసుదేవరావు, ఇతర బీజేపీ నేతలు పాల్గొన్నారు.

**నేడు నిరాహార దీక్ష**

రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు రావాల్సిన బకాయిలు వెంటనే చెల్లించాలనే డిమాండ్‌తో బీజేపీ ఇందిరాపార్క్ వద్ద ఇవాళ నిరాహార దీక్షకు పిలుపునిచ్చింది. ఉదయం 11 గంటలకు నిరాహార దీక్షను చేపడుతున్నది. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు ముఖ్య అతిథిగా హాజరవుతారు. పార్లమెంట్ సభ్యులు, శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు, బీజేపీ రాష్ట్ర పదాధికారులు, నాయకులు ఈ దీక్షలో పాల్గొంటారు.



# మరో బాణసంచా కర్మాగారంలో భారీ పేలుడు



**మొదటిపేజీ తరువాయి**

తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఇప్పటివరకు 17 మంది మృతి చెందారని, 18 మంది గాయపడినట్లు ఆయన తెలిపారు. గాయపడిన వారిని మెరుగైన చికిత్స కోసం నాగ్‌పూర్‌కు తరలించినట్లు చెప్పారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

ప్రమాద స్థలంలో ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు సహాయక చర్యల్లో పాల్గొంటున్నాయి. జిల్లా కలెక్టర్, ఎస్పీ పర్యవేక్షణలో శిథిలాలను తొలగించే పనులు వేగంగా కొనసాగుతున్నాయి. ప్రమాదానికి గల అసలు కారణం ఏమిటన్న దానిపై ఇంకా స్పష్టత రాలేదు. సాంకేతిక నిపుణుల బృందాలు కూడా రంగంలోకి దిగి పరిశీలనలు ప్రారంభించాయి. పేలుడు పదార్థాల భద్రతా ప్రమాణాలు పాటించాయా లేదా అన్న దానిపై విచారణ జరపనున్నారు. ఈ ప్రమాదంపై సమగ్ర దర్యాప్తు జరపాలని ప్రభుత్వం ఉన్నతాధికారులను ఆదేశించింది. బాధిత కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం తరపున ఒక్కొక్కరికి రూ.5 లక్షల ఆర్థిక సహాయం ప్రకటించారు. అలాగే సంబంధిత కర్మాగారం యాజమాన్యం కూడా అదనపు సాయం అందజేస్తుందని సీఎంఓ వర్గాలు వెల్లడించాయి. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులకు సీఎం సూచించారు.

స్థానికులు చెబుతున్న వివరాల ప్రకారం, పేలుడు చాలా తీవ్రంగా ఉండటంతో సమీప గ్రామాల వరకూ భారీ శబ్దం వినిపించింది. కొన్ని ఇళ్ల కిటికీలు కూడా దెబ్బతిన్నట్లు సమాచారం. మంటలు చెలరేగడంతో పొగ దట్టంగా వ్యాపించింది. అగ్నిమాపక సిబ్బంది గంటల పాటు శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చారు. బాణాసంచా కర్మాగారాల్లో భద్రతా ప్రమాణాలపై మళ్లీ చర్చ మొదలైంది. ఇటువంటి ప్రమాదాలు తరచుగా జరుగుతుండటంపై ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కార్మికుల ప్రాణాల భద్రతపై కఠిన చర్యలు తీసుకోవాలని సామాజిక సంస్థలు డిమాండ్ చేస్తున్నాయి. సరైన అనుమతులు, భద్రతా పరికరాలు, శిక్షణ లేకపోవడం వల్లే ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయా అనే కోణంలో అధికారులు విచారణ చేస్తున్నారు. మృతుల కుటుంబాల్లో విషాద వాతావరణం నెలకొంది. ఆర్థికంగా బలహీన వర్గాలకు చెందిన కార్మికులే ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. ఒక్కసారిగా కుటుంబానికి ఆధారమైన వ్యక్తిని కోల్పోవడంతో వారి పరిస్థితి దయనీయంగా మారింది. ప్రభుత్వం ప్రకటించిన ఆర్థిక సాయం తక్షణ ఉపశమనం ఇచ్చినా, దీర్ఘకాలికంగా వారికి ఉపాధి, భద్రత కల్పించాలని స్థానికులు కోరుతున్నారు. ప్రస్తుతం శిథిలాల తొలగింపు పనులు కొనసాగుతున్నాయి. మిగిలిన వారు సురక్షితంగా బయటపడ్డారా అనే విషయంపై స్పష్టత కోసం అధికారులు శ్రమిస్తున్నారు. మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశాన్ని కూడా అధికారులు కొట్టిపారేయడం లేదు.

ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపింది. పరిశ్రమల భద్రతపై మరింత కఠిన నిబంధనలు అమలు చేయాలన్న డిమాండ్లు వినిపిస్తున్నాయి. ప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలు బయటపడిన తర్వాత బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం స్పష్టం చేసింది.నాగ్‌పూర్ సమీపంలో జరిగిన ఈ బాణాసంచా కర్మాగార పేలుడు రాష్ట్రాన్ని విషాదంలో ముంచెత్తింది. సహాయక చర్యలు కొనసాగుతుండగా, బాధిత కుటుంబాలకు అండగా నిలుస్తామని ప్రభుత్వం హామీ ఇస్తోంది. ఈ ఘటన మళ్లీ ఇలాంటి ప్రమాదాలు జరగకుండా కఠిన చర్యలకు దారితీయాలని ప్రజలు ఆశిస్తున్నారు.

# మల్కాపూర్ లో 390 వ స్వచ్ఛా భారత్....

**తూప్రాన్ మార్చ్ 1 (ప్రజా స్వరం)**

తూప్రాన్ మండలం మల్కాపూర్ ఆదర్శ గ్రామంలో 390 వ ఆదివారం స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని గ్రామ శివారులోని పల్లె ప్రకృతి వనం, ఫంక్షన్ హాల్ సమీపంలో చేపట్టడం జరిగింది. సీసీ రోడ్డుకు ఇరువైపులా ఏపుగా పెరిగిన ముళ్ల పొదలను తొలగించడంతోపాటు, ఫంక్షన్ హాల్ లో చెత్తా చెదారాన్ని చీపుర్లతో ఊడ్చి శుభ్రపరిచారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ స్వామి, పంచాయతీ కార్యదర్శి నాగరాజు, వార్డు సభ్యులు జిన్న కృష్ణ, మన్నె తిరుపతి, సరిత పరమేష్ గౌడ్ , పిట్ల వేణు, ఫీల్డ్ అసిస్టెంట్ కనకరాజు,మేకిన్ యువత,పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.



# యధావిధిగా ప్రతి సోమవారం ప్రజావాణి.....

**మెదక్ మార్చి 01 (ప్రజా స్వరం)**

మెదక్ జిల్లా సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో ప్రతి సోమవారం యధావిధిగా ప్రజావాణి కొనసాగుతుందని ప్రజల సద్వినియోగం చేసుకోవాలని మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజావాణి పై కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార దిశగా ప్రజావాణి నిర్వహిస్తున్నట్లు జిల్లా అధికారులందరూ సమయపాలనతో తప్పనిసరిగా ప్రజావాణికి హాజరుకావాలని వెల్లడించారు.





# రైతు భరోసా జమ చేయలేదు

**మాసాయిపేట మార్చి 01 (ప్రజాస్వరం)**

ప్రజా పాలన పేరిట అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, రైతు భరోసా నిధులు జమ చేయకుండా రైతులను వంచించిందని మండల బీజేపీ అధ్యక్షుడు నాగేందర్ రెడ్డి ధ్వజమెత్తారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కారని విమర్శించారు. ఒకవైపు బాబు ఘాట్ వద్ద పేదల ఇళ్లను కూల్చివేస్తూ, మరోవైపు రూ.5 వేల కోట్లతో గాంధీఘాట్ నిర్మించడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

# రోడ్డు ఎప్పటికీ పూర్తి చేస్తారు!

**మాసాయిపేట మార్చి 01 (ప్రజాస్వరం)**

మండలం లోని నాగసాన్పల్లి రోడ్డు నిర్మాణ పనులు అటకెక్కాయి. ఏడాది క్రితం ప్రజాప్రతినిధులు ఆర్భాటంగా శంకుస్థాపన చేసి, కల్వర్టుల వద్ద పైపులు వేసి హడావుడి చేశారు. అయితే, అప్పటి నుంచి పనులు ముందుకు సాగకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు, పాలకులు స్పందించి నిలిచిపోయిన రోడ్డు పనులను వెంటనే ప్రారంభించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు



# మున్సిపల్ చైర్మన్ ఆర్థిక సహాయం

**రామాయంపేట మార్చి 01 (ప్రజాస్వరం )**

మెదక్ శాసనసభ్యులు డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు సూచనల మేరకు రామాయంపేట మున్సిపల్ చైర్మన్ గజవాడ లావణ్య నాగరాజ్ ఆ కుటుంబాన్ని కి 5000/ రూపాయలు ఆర్థిక సాయం అందించి 50 కిలోల బియ్యాన్ని ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గజవాడ లావణ్య నాగరాజ్ తో పాటు గాయంతి కుమార్,పల్లె రాజు, బత్తుల రవి మరియు యాదవ సోదరులు తదితరులు పాల్గొన్నారు



# అంబాజీపేట లో ఇఫ్తార్ విందు....

**చిన్న శంకరంపేట మార్చ్ 1 ( ప్రజాస్వరం )**

చిన్న శంకరంపేట మండల పరిధిలోని అంబాజీపేట లో ఆదివారం ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు నిర్వహించారు ఇసుఫ్ అలీ సౌజన్యంతో ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి ఉపవాస దీక్షను విరమించారు ఈ కార్యక్రమంలో మజీద్ అభివృద్ధి కమిటీ సభ్యులు మాజీ సర్పంచులు ముస్లిం సోదరులు పాల్గొన్నారు



# సిద్దిపేట స్కెచ్ మెదక్ లో అమలు....

- సిద్దిపేట స్కెచ్ మెదక్ లో అమలు....
- మీకు బెయిల్ ఎలా వచ్చింది వారికి ఎందుకు రాలేదు....
- సింపతీ కోసమే హై డ్రామా అంత......
- ఇక పై దాడికి ప్రతి దాడి చేస్తాం.......
- వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్......

**మెదక్ మార్చి 01 (ప్రజా స్వరం)**



మెదక్ లో ఎమ్మెల్యే వాహనం పై దాడి, నా పై జరిగిన హత్య యత్నానికి కారణం సిద్దిపేట లో వేసిన స్కెచ్ ఇక్కడ మల్లికార్జున్ గౌడ్ తన అనుచరులతో అమలు చేయించారని మున్సిపల్ వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్ అన్నారు. ఆదివారం మెదక్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆయన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ వాస్తవాలు ప్రజల్లోకి వెళ్లడం లేదని, వాస్తవమేదో అవాస్తవమేదో ప్రజలకు చేరాల్సిన అవసరం ఉందని అన్నారు. అక్రమ అరెస్టులు దాడులు అంటున్నారని ఈరోజు జరుగుతున్న పరిణామాలన్ని ఓడిపోయిన వ్యక్తులు సింపతి పొందడానికే చేస్తున్న కుట్రలన్నారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో రాత్రి 15 వార్డు లో పదుల సంఖ్యలో మల్లికార్జున్ గౌడ్ తన అనుచరులను పెట్టుకొని మా మద్దతు దారులైన ఓ మహిళ ఇంటి ముందు చేరి భయభ్రాంతులకు గురి చేశారనే సమాచారాన్ని అందుకున్న ఎమ్మెల్యే ఆమెను పరామర్శించేందుకు రావడం జరిగిందని అన్నారు. ఎమ్మెల్యే అక్కడికి వచ్చింది డబ్బులు పంచేందుకు కాదని ఆయనకు డబ్బులు పంచాల్సిన అవసరం ఏముంటుందన్నారు. తనపై దాడి జరిగిన రాత్రి ఏం జరిగిందనే వాస్తవాన్ని ప్రజలకు ఎందుకు తీసుకెళ్లలేక పోతున్నారని ఆయన ప్రశ్నించారు. ఎమ్మెల్యే పై దాడి జరిగిన రాత్రి మల్లికార్జున్ గౌడ్ తన అనుచరులను గుంపులు గుంపులుగా ఏర్పాటు చేసి ఎవరు వస్తే వారిపై దాడులు చేసేందుకు సిద్ధమయ్యారని, సిద్దిపేట లో హరీష్ రావు వేసిన స్కెచ్ ను ఇక్కడ అమలు చేశారన్నారు. నాపై గొడ్డలి తీసుకుని భయభ్రాంతులకు గురి చేసి చంపే, కుట్ర చేశారని అన్నారు. దాడి చేసిన వారిపై ఎలాంటి పిర్యాదు చేయలేదని మీరే ఫోటో లు, వీడియోలు తీసి మీరే కదా ఫోన్ ద్వారా షేర్ చేసింది మీరు కదా అన్నారు. ఎమ్మెల్యే వాహనం పై, తన పై దాడులు జరిగిన విషయం వాస్తవం కాదా అవి మీకెందుకు కళ్లకు కనబడడం లేదు అన్నారు. ఆరోజు జరిగిన దాడిపై ఎక్కడ స్పందించకూడదని దీనికి ప్రజలే సరైన సమాధానం చెబుతున్నారని దానికి అనుగుణంగానే ప్రజలు మంచి మెజారిటీతో గెలిపించారన్నారు. మీరు సోషల్ మీడియాలో వైరల్ చేసిన వీడియోలో చాలా మంది ఉన్నారని మేము ఏ ఒక్కరిపై కూడా ఫిర్యాదు చేయలేదని అన్నారు. మీరు ప్రోత్సహిస్తే నాపై దాడులకు పాల్పడ్డ వ్యక్తులు లోపల ఉంటారు ఎట్లా, మీరు బయట ఉంటారు ఎట్లా అని, వారికి బెయిల్ ఎందుకు రాలేదు మీకు బెయిల్ ఎలా వచ్చిందని ఆయన ప్రశ్నించారు. జైల్లో ఉన్న వారి కుటుంబ సభ్యుల సింపతి పొందేందుకే ఇలాంటి డ్రామాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఎమ్మెల్యే అభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగుతున్నారని పట్టణానికి కావాల్సిన నిధులను సైతం తీసుకు వస్తున్నారని ఇవన్నీ చూసి ప్రజలు కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టారన్నారు. మెదక్ నియోజకవర్గంలోని మెదక్, రామయంపేట్ మున్సిపాలిటీలోనూ కాంగ్రెస్ జెండా ఎగరడానికి స్థానిక ఎమ్మెల్యే రోహిత్ రావు, మైనంపల్లి హనుమంతరావు కారణమన్నారు. ఇక మీదట కాంగ్రెస్ పార్టీ, స్థానిక ఎమ్మెల్యే, హనుమంతరావు లపై అనుచిత వ్యాఖ్యలు చేసినట్లయితే సహించేది లేదన్నారు. ప్రజా శ్రేయస్సు కోసం మీరు పని చేసినట్లయితే మీకు మరోసారి ప్రజలు పట్టం కట్టే వారిని మీరు మీ కుటుంబ సభ్యులు బంధువులను మాత్రమే ప్రోత్సహించుకున్నారని అన్నారు. మీ అంతల మీరే బయటికి వచ్చి హై డ్రామా చేస్తారని, లోపలికి వెళ్లి నవ్వుకుంటురని, దీంతో ఎవరి తప్పుదోవ పట్టిస్తున్నారని అన్నారు. ఇప్పటి నుండి తమ పై ఎలాంటి అసత్య ఆరోపణలు చేసిన, దాడులకు తెగబడిన దాడులకు ప్రతి దాడులు ఉంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, కౌన్సిలర్లు గంట సంపత్, హరిత, మన్సూర్, శశాంక్, పట్టణ అధ్యక్షుడు గంగాధర్, నాయకులు రాగి అశోక్, మ్యాడమ్ బాలకృష్ణ, మేడి మధుసూదన్ రావు, లక్ష్మీనారాయణ, గోదా సాయి, తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యమకారులను గుర్తించడానికి? చట్టబద్ధత కలిగిన కమిటీని వేయాలి

- సంగిశెట్టి క్రిస్టఫర్

**వలిగొండ మార్చ్ 1(ప్రజాస్వరం):**



రాష్ట్ర సాధన కోసం పోరాటలు చెసిన ఉద్యమకారులను గుర్తించడానికి చట్టబద్ధత కలిగిన కమిటీ వేయాలని రాజకీయాలకు ఎలాంటి తావు లేకుండా ఉండాలని లేకుంటే ఉద్యమకారులు నష్టపోయే ప్రమాదం ఉన్నదని మలిదశ ఉద్యమకారుడు టియు జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంగిశెట్టి క్రిస్టఫర్ అన్నారు. ప్రభుత్వం సబ్ కమిటీతో పాటు జుడిషియల్ చట్టబద్ధత కలిగిన కమిటీ వల్లనే నిజమైన నికార్సైన ఉద్యమకారులకు న్యాయం జరుగుతుందన్నారు లేకుంటే ఉద్యమకారులు నష్టపోయి ఎలాంటి ఉద్యమంతో సంబంధంలేని వారికి లాభం చేరే అవకాశాలు ఉన్నందున అలాంటి వాటికి చోటు ఇవ్వొద్దని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.




# అమరవీరుల త్యాగాల వల్లనే వర్గీకరణ : మాదిగ హక్కుల దండోరా.

- ఎస్సీ వర్గీకరణ కు అమరవీరుల త్యాగాలే ప్రధాన కారణం.
- అమరవీరుల సంస్మరణ దినోత్సవం వేడుకల్లో పాల్గొన్న రాష్ట్ర అధ్యక్షులు రేగుంట సునీల్
- మాదిగ హక్కుల దండోరా గజ్వేల్ నియోజకవర్గ ఇంచార్జ్ నల్ల నరేందర్

**గజ్వేల్ మార్చి 01 (ప్రజాస్వరం):-**

ఎస్సీ వర్గీకరణ తోపాటు, మాదిగలకు రావాల్సిన హక్కులు సాధించడానికి మాదిగ అమరుల త్యాగాలే ప్రధాన కారణమని మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర అధ్యక్షులు రేగుంట సునీల్ మాదిగ అన్నారు.ఆదివారం మాదిగ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా ములుగు మండలం క్షీరసాగర్ గ్రామంలో మాదిగ హక్కుల దండోరా గజ్వేల్ నియోజకవర్గ ఇంచార్జ్ నల్ల నరేందర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాదిగలకు విద్య ఉద్యోగ అవకాశాలు వచ్చాయంటే అందుకు కారకులు అమర వీరులేనని చెప్పారు. వారి త్యాగాల ద్వారా ఉద్యమాన్ని నిలబెట్టి హక్కుల సాధనకు మార్గం వేసిన మార్గదర్శకులని కొనియాడారు. అలాంటి వీరుల త్యాగాలను మాదిగ యువత, విద్యార్థి లోకం స్మరించుకొని.. వారి ఆశయాలు కొనసాగించాలని తెలిపారు.అమరవీరుల కుటుంబాలకు ఇంటికి ఒక ప్రభుత్వ ఉద్యగం, మరియు ఇంటి స్థలం ఇవ్వాలని, ఇల్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు.హైదరాబాద్ లో మాదిగ అమర వీరుల స్తూపం నిర్మించడానికి స్థలం కేటాయించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో మాదిగ హక్కుల దండోరా అధికార ప్రతినిధి ఎల్కపల్లి రాజేందర్ మాదిగ, సిద్దిపేట జిల్లా సర్పంచుల ఫోరమ్ అధ్యక్షులు బాల్ రెడ్డి,అసైడ్ భూముల జిల్లా అధ్యక్షుడు నల్ల శ్రీను, ఉప సర్పంచ్ నల్ల పరుశురాం మాదిగ, ఎమ్మార్పీఎస్ గ్రామ అధ్యక్షుడు గుండ్ల అశోక్, రవి, ఆదాసు సురేందర్, ఉద్దెమారి వెంకటేష్, బొగ్గుల మహేష్, తదితరులు పాల్గొన్నారు

# కాళ్లకల్ లో ఆధార్ కేంద్రం ఏర్పాటు చేయాలి : విద్యాసాగర్

**మనోహరాబాద్( ప్రజాస్వరం ) ;**

మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం కాళ్లకల్ మేజర్ గ్రామపంచాయతీలో ఆధార్ సేవా కేంద్రం ఏర్పాటు చేయాలని సోషల్ వర్కర్ నేతి కుంట విద్యాసాగర్ ఒక ప్రకటనలో కోరారు. కాళ్లకల్ పారిశ్రామిక కేంద్రం కావడంతో వేలాదిమంది ప్రజలు స్థానికంగా నివాసముంటున్నారు. వివిధ రాష్ట్రాల ప్రజలు వలస వచ్చి ఇక్కడ ఉపాధి పొందుతున్న ప్రాంతం కావడంతో ఆధార్ సేవలు లేక ప్రజలు చాలా ఇబ్బందులకు గురవుతున్నారు. ఆధార్ కార్డులో తొరలిన తప్పులను సరిదిద్దుకోవడంతోపాటు చేర్పులు మార్పులు చేసుకునేందుకు వీలు కల్పించేలా ఆధార్ కేంద్రం కాళ్ళకల్ లో ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. మేజర్ గ్రామపంచాయతీ కావడంతో చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు కూడా వీలుగా ఉంటుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. కాళ్లకల్ గ్రామంలో సబ్ పోస్ట్ ఆఫీస్ ఉండడంతో అందులోనే ఆధార్ కేంద్రం కూడా ఏర్పాటు చేస్తే అన్ని విధాలుగా ప్రజలకు సౌకర్యవంతంగా ఉంటుందని అన్నారు. గౌరవ జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు ఆధార్ సేవా కేంద్రం ఏర్పాటుకు అన్ని రాజకీయ పార్టీల ప్రజా ప్రతినిధులు కృషిచేసి ఆధార్ కేంద్రం ఏర్పాటు చేయాలని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. పరిశ్రమాల్లో ఉపాధి పొందుతున్న కార్మికులకు పీఎఫ్, ఈ ఎస్ ఐ పొందాలంటే కొందరి కార్మికుల ఆధార్ కార్డులలో తప్పులు వుంటున్నాయి. వాటిని సరిదిద్దుకోవాలంటే కార్మికులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తప్పులను సరిదిద్దుకోవాలంటే మేడ్చల్ లేక తూప్రాన్ ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు, ప్రజా ప్రతి నిధులు వెంటనే స్పంధుంచాలని విజ్ఞప్తి చేషారు.



# సంతలో ఐదు తులాల బంగారు నగల చోరీ....

**మెదక్ మార్చ్ 01 (ప్రజా స్వరం)**

సంతలో 5 తులాల బంగారు ఆభరణాలు చోరీ అయిన సంఘటన శనివారం సాయంత్రం జరిగింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం మెదక్ మండలం మాంబోజీపల్లి గ్రామంలో కొల్చారం కు చెందిన చింతలగారి భార్య భర్తలు శ్రావణి ప్రవీణ్ మెదక్ వెళ్లి తిరిగి ప్రయాణం లో సంతలో కూరగాయలు తీసుకోవడానికి వెళ్ళారు. తమ వద్ద ఉన్న హాండ్ బ్యాగులో ఉన్న 8 లక్షల విలువ గల 5 తులాల బంగారు నగలు నెక్లెస్ 2.5, నల్ల పూసలు 2 తులాలు, మాటిలు, చెవి కమ్మలు అర తులం చోరీ జరిగాయి. బాధితులు కొద్దిసేపటి కి హ్యాండ్ బ్యాగ్ చూడగా కనిపించకుండా పోవడంతో కంగుతిన్న బాధితులు మెదక్ లో రూరల్ పోలీస్ స్టేషన్ లో పిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్ఐ లింగం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# విదేశాంగ విధానంలో మోడీ విఫలం



- భారత్ ప్రయోజనాలకు ద్రోహం
- అంతర్జాతీయ అంశాల్లో మౌనం సరికాదు
- కాంగ్రెస్ సీనియర్ నేత జై రాం రమేశ్
- కేంద్ర ప్రభుత్వ విధానాలపై ఆగ్రహం
- భారత్ నైతికత దెబ్బ తీస్తున్నారని మండిపాటు
- దేశానికి స్పష్టత లేకుండా వ్యవహరిస్తున్నారని విమర్శలు

**ప్రజాస్వరం, న్యూఢీల్లీ**

కేంద్ర ప్రభుత్వ విదేశాంగ విధానం పూర్తిగా విఫలమైందని కాంగ్రెస్ పార్టీ తీవ్ర విమర్శలు చేసింది. ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో దేశం కీలక అంతర్జాతీయ అంశాల్లో సరైన వైఖరి చూపడం లేదని ఆరోపించింది. ముఖ్యంగా ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దాడుల విషయంలో కేంద్రం మౌనం వహించడం భారత విలువలకు విరుద్ధమని పేర్కొంది. కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి జైరాం రమేష్ సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌పై దాడులకు ముందు ప్రధాని ఇజ్రాయెల్ పర్యటన చేయడం తగదని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రధాని పర్యటన ముగిసిన కొద్ది రోజులకే దాడులు జరిగాయని గుర్తుచేశారు. ఇలాంటి సందర్భంలో ఇజ్రాయెల్ పార్లమెంటు వేదికగా ప్రసంగించడం ద్వారా భారత్ నైతిక స్థాయిని దెబ్బతీశారని విమర్శించారు. తనను 'విశ్వగురు'గా చూపించుకునే ప్రయత్నం చేస్తున్నారని, కానీ అంతర్జాతీయ రాజకీయాల్లో స్పష్టత లేకుండా వ్యవహరిస్తున్నారని కాంగ్రెస్ ఆరోపించింది. ఇరాన్‌లో కీలక వ్యక్తుల హత్యలపై కేంద్రం స్పందించకపోవడం దేశ సూత్రాలకు విరుద్ధమని జైరాం రమేశ్ పేర్కొన్నారు.అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పాకిస్థాన్ పట్ల సానుకూల వైఖరి చూపుతున్నారని కాంగ్రెస్ విమర్శించింది. పాక్ ఆర్మీ చీఫ్‌ను ప్రశంసించడం, అఫ్గానిస్థాన్‌పై పాకిస్థాన్ చర్యలకు మద్దతు ఇవ్వడం వంటి విషయాలపై కేంద్రం ఎందుకు మౌనంగా ఉందని ప్రశ్నించింది. జమ్మూకశ్మీర్‌లో జరిగిన ఉగ్రదాడి తర్వాత కూడా స్పష్టమైన స్పందన రాలేదని పేర్కొంది.

అలాగే "ఆపరేషన్ సిందూర్" అంశాన్ని కూడా కాంగ్రెస్ ప్రస్తావించింది. ఈ ఆపరేషన్ ఆగిన విషయాన్ని తొలుత అమెరికా ప్రకటించిందని, కానీ భారత్ నుంచి స్పష్టత రాలేదని విమర్శించింది. విదేశాంగ నిర్ణయాల్లో పారదర్శకత లేకపోవడం దేశానికి నష్టం చేస్తోందని అభిప్రాయపడింది.భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందంపై కూడా కాంగ్రెస్ అనుమానాలు వ్యక్తం చేసింది. ప్రధాని విజ్ఞప్తి మేరకే ట్రేడ్ డీల్ ఖరారైందని ట్రంప్ ప్రకటించారని గుర్తుచేసింది. అయితే ఆ ఒప్పందం ఏకపక్షంగా ఉందని ఆరోపించింది. భారత మార్కెట్‌ను అమెరికా ఉత్పత్తులకు తెరవడానికి పెద్ద హామీలు ఇచ్చారని, కానీ భారత్‌కు తగిన లాభాలు లభించలేదని పేర్కొంది.

అమెరికా సుంకాల విధానంపై అక్కడి సుప్రీంకోర్టు అభ్యంతరం వ్యక్తం చేసిన విషయాన్ని కాంగ్రెస్ ప్రస్తావించింది. ప్రపంచ దేశాలపై ఏకపక్షంగా సుంకాలు విధించడం రాజ్యాంగ విరుద్ధమని అమెరికా కోర్టు అభిప్రాయపడిందని తెలిపింది. ఈ నేపథ్యంలో ట్రేడ్ ఒప్పందం త్వరగా ఖరారు చేయడం వెనుక రాజకీయ కారణాలు ఉన్నాయేమోనని కాంగ్రెస్ అనుమానం వ్యక్తం చేసింది. రష్యా నుంచి చమురు కొనుగోళ్లపై కూడా స్పష్టత ఇవ్వాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. అమెరికాతో ఒప్పందం నేపథ్యంలో రష్యా నుంచి దిగుమతులు తగ్గిస్తామని హామీ ఇచ్చారా లేదా అన్న దానిపై కేంద్రం వివరణ ఇవ్వాలనింది.

చైనా విషయంలో కూడా కేంద్రం వైఖరి సరైనదికాదని కాంగ్రెస్ ఆరోపించింది. గాల్వన్ లోయలో జరిగిన ఘర్షణ తర్వాత ప్రధాని చేసిన ప్రకటనల వల్ల భారత్ బలహీన స్థితిలో నిలిచిందని పేర్కొంది. 2020లో జరిగిన ఘర్షణలో 20 మంది భారత సైనికులు అమరులైన విషయం గుర్తుచేసింది. ఆ సమయంలో చైనాకు అనుకూలంగా వ్యాఖ్యానించినట్లు ఆరోపిస్తూ, దాని ప్రభావం చర్చల్లో కనిపించిందని కాంగ్రెస్ తెలిపింది.

మొత్తంగా కేంద్ర ప్రభుత్వ విదేశాంగ విధానం వల్ల భారత్ అంతర్జాతీయ వేదికపై స్పష్టమైన దిశ లేకుండా ఉందని కాంగ్రెస్ అభిప్రాయపడింది. ముఖ్యమైన అంతర్జాతీయ సంఘటనలపై ప్రభుత్వం మౌనం పాటించడం దేశ ప్రయోజనాలకు హానికరమని పేర్కొంది. విదేశాంగ అంశాల్లో పారదర్శకత, స్పష్టత అవసరమని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. ఇప్పటికైనా కేంద్రం తన వైఖరిని మార్చుకుని దేశ ప్రయోజనాలను కాపాడేలా నిర్ణయాలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ కోరింది. దేశ భద్రత, ఆర్థిక ప్రయోజనాలు, అంతర్జాతీయ గౌరవం దృష్టిలో ఉంచుకుని విదేశాంగ విధానాన్ని పునఃసమీక్షించాలని సూచించింది.

# ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ దుర్మరణం

- అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్త దాడుల్లో మృతి
- అధికారికంగా వెల్లడించిన ఇరాన్
- దాడిలో ఖమేనీ కుమార్తె కుటుంబం మృతి
- ప్రపంచ వ్యాప్తంగా సంచలనంగా మారిన ఘటన
- పలు దేశాల్లో సంబరాలు.. కొన్ని చోట్ల నిరసనలు
- కొత్త ఇరాన్ సుప్రీం లీడర్‌గా అయతొల్లా అలీ రెజా అరాఫీ
- అమెరికా పెద్ద తప్పు చేసిందన్న ఇరాన్
- ప్రతీకారం తీర్చుకుంటామని హెచ్చరిక
- నిర్విరామంగా కొనసాగుతున్న దాడులు

**ప్రజాస్వరం, ఇరాన్**

మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు ఒక్కసారిగా భగ్గుమన్నాయి. అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్త సైనిక చర్యల్లో ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ మరణించారనే వార్తలు సంచలనం సృష్టించాయి. ఈ విషయాన్ని అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన సోషల్ మీడియా వేదిక 'ట్రూత్ సోషల్' ద్వారా ప్రకటించినట్లు సమాచారం. మరోవైపు ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ కూడా కీలక ప్రకటన చేశారు.

**ట్రంప్ ప్రకటనతో ప్రపంచ దృష్టి**

ట్రంప్ తన పోస్టులో ఖమేనీని "చరిత్రలో అత్యంత క్రూర నాయకుల్లో ఒకరు"గా పేర్కొంటూ, సంయుక్త ఆపరేషన్‌లో అతను హతమయ్యాడని వెల్లడించినట్లు తెలుస్తోంది. అత్యున్నత నిఘా వ్యవస్థలు, ఆధునిక ట్రాకింగ్ పరికరాల సాయంతో ఖమేనీ కదలికలను గమనించి ఈ దాడి చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. ఇజ్రాయెల్‌తో వ్యూహాత్మకంగా కలిసి పనిచేయడం వల్లే ఈ ఆపరేషన్ విజయవంతమైందన్నారు. ఇరాన్ ప్రజలు తమ దేశాన్ని తిరిగి స్వాధీనం చేసుకోవడానికి ఇదే సరైన సమయమని ట్రంప్ పిలుపునిచ్చినట్లు సమాచారం. ఐఆర్‌జీసీ, ఇరాన్ సైన్యం ఇకపై పోరాటానికి సిద్ధంగా లేరని, వారు రక్షణ కోరుతున్నారని కూడా ఆయన వ్యాఖ్యానించినట్లు వార్తలు చెబుతున్నాయి.

**ఇజ్రాయెల్ వైఖరి**

ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు విడుదల చేసిన వీడియోలో ఖమేనీ మరణాన్ని నేరుగా ధృవీకరించకపోయినా, అతని నివాస సముదాయం పూర్తిగా ధ్వంసమైందని తెలిపారు. ఈ దాడుల్లో రివల్యూషనరీ గార్డ్ కమాండర్లు, అణు శాస్త్రవేత్తలు కూడా మరణించినట్లు పేర్కొన్నారు. ఇరాన్ కీలక రక్షణ కేంద్రాలే లక్ష్యంగా దాడులు జరిగాయని చెప్పారు. అమెరికా రక్షణ విభాగం ఈ ఆపరేషన్‌కు "ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ" అని పేరు పెట్టినట్లు సమాచారం.

**భారీ బాంబుదాడులు**

శనివారం తెల్లవారుజామున టెహ్రాన్‌లో ఖమేనీ అధికారిక నివాసం, కార్యాలయ సముదాయంపై దాదాపు 30 భారీ బాంబులు ప్రయోగించినట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు చెబుతున్నాయి. దాడి సమయంలో ఖమేనీ భూగర్భ బంకర్‌లో ఉన్నారని, అయితే బాంబుల తీవ్రతకు ఆ బంకర్ కూడా ధ్వంసమైందని సమాచారం. శాటిలైట్ చిత్రాలు టెహ్రాన్‌లోని ఆ ప్రాంతం పూర్తిగా శిథిలాలుగా మారిన దృశ్యాలను చూపిస్తున్నాయని వార్తలు చెబుతున్నాయి.

**ఇరాన్ అధికారిక ప్రకటన**

ఇరాన్ మీడియా ఖమేనీ మరణాన్ని ధృవీకరించినట్లు తెలుస్తోంది. ఆయనతో పాటు కుటుంబ సభ్యులు కూడా ఈ దాడుల్లో మృతి చెందినట్లు సమాచారం. ప్రభుత్వం 40 రోజుల పాటు సంతాప దినాలు పాటించనున్నట్లు ప్రకటించినట్లు వార్తలు చెబుతున్నాయి. ఖమేనీని "అమరవీరుడు"గా అభివర్ణించిన ఇరాన్ ప్రభుత్వం, ఈ దాడికి ప్రతీకారం తప్పదని హెచ్చరించినట్లు సమాచారం.

**కొత్త సుప్రీం లీడర్ నియామకం**

ఖమేనీ మరణం నేపథ్యంలో ఇరాన్ తాత్కాలిక సుప్రీం లీడర్‌గా అయతొల్లా అలీ రెజా అరాఫీను నియమించినట్లు వార్తలు చెబుతున్నాయి. రాజ్యాంగంలోని ఆర్టికల్ 111 ప్రకారం తాత్కాలిక మండలి బాధ్యతలు చేపట్టనుంది. తర్వాత అసెంబ్లీ ఆఫ్ ఎక్స్‌పర్ట్స్ పూర్తిస్థాయి సుప్రీం లీడర్‌ను ఎన్నుకోనుంది. అరాఫీ ఇరాన్‌లో ప్రభావశీల మతపెద్దగా గుర్తింపు పొందారు. గార్డియన్ కౌన్సిల్ సభ్యుడిగానూ పనిచేశారు. ఖమేనీకి సన్నిహితుడిగా పేరుంది.

**ప్రతిదాడులతో మరింత ఉద్రిక్తత**

అమెరికా-ఇజ్రాయెల్ దాడులకు ప్రతిగా ఇరాన్ కూడా భారీ క్షిపణి, డ్రోన్ దాడులు ప్రారంభించింది. ఇజ్రాయెల్‌పై వందల సంఖ్యలో డ్రోన్లు, క్షిపణులు ప్రయోగించినట్లు సమాచారం. ఇజ్రాయెల్ వైమానిక రక్షణ వ్యవస్థలు వాటిలో చాలా వరకు అడ్డుకున్నాయని అక్కడి సైన్యం తెలిపినట్లు వార్తలు చెబుతున్నాయి. బహ్రెయిన్, కువైట్, ఖతార్, యూఏఈ వంటి దేశాల్లోని అమెరికా సైనిక స్థావరాలపై కూడా దాడులు జరిగాయని సమాచారం. పలు దేశాలు తమ గగనతలాలను మూసివేశాయి. విమానయాన సేవలు అంతరాయం పొందాయి.

ఇరాన్‌లో తాత్కాలిక ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. ఈ మేరకు మండలిని కూడా ఏర్పాటు చేశారు. కాగా ఇరాన్ సుప్రీం అయతుల్లా అలీ ఖమేనితో పాటు మొత్తం 40 మంది టాప్ కమాండర్స్ మృతి చెందారు. దీంతో ఇరాన్ తదుపరి లీడర్ ఎవరే సస్పెన్స్ కొనసాగింది. ఈ సస్పెన్స్‌కు తాజాగా తెరపడింది. సీనియర్ మతాధికారి అయతుల్లా అలీరేజా అరాఫీని ఇరాన్ తాత్కాలిక సుప్రీం లీడర్‌గా ప్రకటించారు. అయతుల్లా అలిరేజా అరాఫీని తాత్కాలిక నాయకత్వ మండలి సభ్యుడిగా ఎక్స్‌పెడియెన్సీ డిస్సర్‌న్‌మెంట్ కౌన్సిల్ ఎన్నుకుంది. అయితే ఈ విషయాన్ని ఎక్స్‌పెడియెన్సీ కౌన్సిల్ ప్రతినిధి మొహ్సేన్ దెహ్నవి ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఖమేని చనిపోయిన తర్వాత ఇరాన్ రాజ్యాంగం ఆర్టికల్ 111ను యాక్టివ్ చేశారు. దీని ప్రకారం ఇరాన్‌లో అత్యవసర నాయకత్వాన్ని ఏర్పాటు చేశారు. శాశ్వత సుప్రీం లీడర్‌ను ఎన్నుకునే వరకు ముగ్గురు సభ్యుల కౌన్సిల్ సుప్రీం లీడర్ అధికారాలను స్వీకరిస్తారు. ఈ కౌన్సిల్‌లో భాగమైన అలిరేజా అరాఫీ... అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియన్, ప్రధాన న్యాయమూర్తి ఘోలంహోస్సేన్ మొహ్సేనిఎజెయ్‌లతో కలిసి దేశాన్ని నడిపిస్తారని తెలుస్తోంది.

**పౌర ప్రాంతాలపై ప్రభావం**

దక్షిణ ఇరాన్‌లోని ఒక బాలికల పాఠశాలలో 80 మందికి పైగా విద్యార్థులు మరణించినట్లు ఇరాన్ వార్తా సంస్థ తెలిపినట్లు సమాచారం. ఇదే సమయంలో దుబాయ్, అబుదాబి వంటి ప్రాంతాల్లో పేలుళ్లు సంభవించినట్లు వార్తలు వచ్చాయి. ప్రపంచంలోనే ఎత్తైన భవనంగా



పేరొందిన బుర్జ్ ఖలీఫా సమీపంలో క్షిపణులు వెళ్లిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. భవనానికి స్వల్ప నష్టం జరిగిందని కొన్ని కథనాలు చెబుతున్నాయి. అలాగే ప్రముఖ హోటల్ బుర్జ్ అల్ అరబ్ సమీపంలో కూడా మంటలు చెలరేగినట్లు సమాచారం. అయితే ఈ ఘటనలపై అధికారిక స్పష్టత పూర్తిగా రాలేదు.

**ప్రాంతీయ యుద్ధ భయం**

ఇజ్రాయెల్, అమెరికా దాడులతో ప్రారంభమైన ఈ ఘర్షణ, ఇరాన్ ప్రతిదాడులతో మరింత తీవ్రరూపం దాల్చింది. గల్ఫ్ ప్రాంతం అంతటా యుద్ధ వాతావరణం నెలకొంది. సైరన్లు మోగుతుండగా ప్రజలు భద్రతా ప్రాంతాలకు తరలిపోతున్నారు. మధ్యప్రాచ్యంలో దీర్ఘకాలిక యుద్ధానికి ఇది నాంది కావచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. అంతర్జాతీయ సమాజం ఆందోళన వ్యక్తం చేస్తోంది. ఐక్యరాజ్యసమితి సహా పలు దేశాలు తక్షణ కాల్పుల విరమణకు పిలుపునిస్తున్నట్లు సమాచారం.

**ఖమేనీ పాలనపై ఒక చూపు**

1989లో అయతుల్లా రుహోల్లా ఖొమేనీ మరణం తర్వాత ఖమేనీ ఇరాన్ సుప్రీం లీడర్‌గా బాధ్యతలు చేపట్టారు. ఇస్లామిక్ రిపబ్లిక్ వ్యవస్థను బలపరిచారు. రివల్యూషనరీ గార్డ్‌ను శక్తివంతమైన సంస్థగా తీర్చిదిద్దారు. ప్రాంతీయ రాజకీయాల్లో ఇరాన్ ప్రభావాన్ని విస్తరించేందుకు కృషి చేశారు. ఇప్పుడు ఆయన మరణంతో ఇరాన్ రాజకీయ భవిష్యత్తు ఏ దిశగా వెళ్లనుందో అనిశ్చితి నెలకొంది. ఖమేనీ మృతి వార్తలు మధ్యప్రాచ్యాన్ని కుదిపేశాయి. ఈ పరిణామాలు ఎంతవరకు నిజమో, తదుపరి పరిస్థితులు ఎలా మలుపుతిప్పుతాయో ప్రపంచం ఆసక్తిగా గమనిస్తోంది. పరిస్థితి అత్యంత ఉద్రిక్తంగా ఉంది. తదుపరి ప్రకటనలు, అంతర్జాతీయ ప్రతిస్పందనలు కీలకంగా మారనున్నాయి.




## మేరా యువభారత్ ఆధ్వర్యంలో ఆదర్శ గురుకుల కళాశాలలో బ్లాక్ లెవెల్ స్పోర్ట్స్ మీట్

**కామారెడ్డి జిల్లా మార్చి 01 (ప్రజాస్వరం):**

మేరా యువభారత్ ఆధ్వర్యంలో గాంధారి మండల కేంద్రంలో ఏకలవ్య ఆదర్శ గురుకుల కళాశాలలో బ్లాక్ లెవెల్ స్పోర్ట్స్ మీట్ 2025 26 ను కళాశాల ప్రిన్సిపాల్ సురేష్ చంద్ర సిర్వి చేతుల మీదుగా ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ మెంబర్ సునీల్ రాథోడ్ మాట్లాడుతూ మేరా యువభారత్ గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నటువంటి యువతి యువకుల్లో క్రీడా నైపుణ్యాలను అలాగే సామాజిక సేవా భావాన్ని,లీడర్ షిప్ క్వాలిటీస్ లను పెంపొందించడానికి ఎన్నో సేవా కార్యక్రమాలను నిర్వహిస్తుంది.అందులో భాగంగా నేడు ఈ బ్లాక్ లెవెల్ స్పోర్ట్స్ మీట్ ను నిర్వహించాము నేటితరం యువత అన్ని రంగాల్లో రాణిస్తూ ఫిట్గా ఉంటూ ఫిట్ ఇండియాను తయారు చేయడమే ముఖ్య ఉద్దేశం ప్రపంచంలో అత్యంత యువశక్తి కలిగిన దేశం భారతదేశం అలాంటి యువతను సన్మార్గంలో నడిపించడమే మేరా యువ భారత్ యొక్క ముఖ్య లక్ష్యం అన్నారు.అందులో అమ్మాయిలకు కబడ్డీ,అబ్బాయిలకు వాలీబాల్ అమ్మాయిలు అబ్బాయిలకు ఇద్దరికీ వేరువేరుగా 100 మీటర్ల పరుగు పందాలు, చెస్ పోటీలు టాగ్గాఫ్ వార్,స్కిప్పింగ్ పోటీలను నిర్వహించి గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులను సర్టిఫికెట్లను ప్రధానం చేయడం జరిగింది. గెలుపొందిన వారికి త్వరలో జిల్లా స్థాయిలు క్రీడా పోటీలు నిర్వహించడం జరుగుతుంది అన్నారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ సురేష్ చంద్ర సిర్వి మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు అవసరం క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని విద్యార్థులకు తెలిపారు నేటి తరం యువతలో ఎన్నో నైపుణ్యాలు ఉన్నాయి వాటిని గుర్తించి సరైన మార్గంలో నడిపిస్తే ప్రపంచంలో ఉన్న అన్ని దేశలకంటే ముందు వరసలో భారత్ ఉంటుంది అన్నారు.ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ ఇంచార్జ్ స్నోజ్ యాదవ్,కుళవిందర్ మణి విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.




## డా. నిఖిల్ జయంతి సందర్భంగా ఉచిత వైద్య, రక్తదాన శిబిరం




**కుత్బుల్లాపూర్,మార్చి 01 (ప్రజాస్వరం):**


కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని బౌరంపేటలో సింధు పార్సిల్ సర్వీసెస్ సంస్థ సహ వ్యవస్థాపకుడు డాక్టర్ నిఖిల్ స్మారకార్థంగా ఉచిత వైద్య శిబిరం, రక్తదాన శిబిరం నిర్వహించారు. డా. నిఖిల్ నూతక్కి 27వ జయంతి సందర్భంగా ఆయన స్మారకార్థంగా ఏర్పాటైన డా. నిఖిల్ నూతక్కి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా కిమ్స్ హాస్పిటల్ సహకారంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించగా, ఎన్టీఆర్ ట్రస్ట్ తో కలిసి రక్తదాన శిబిరం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి శేర్లింగంపల్లి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అరికెపూడి గాంధీ, కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ ఇంచార్జ్ కోలాన్ హనుమంత రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. మియాపూర్ మాజీ కార్పొరేటర్ శ్రీకాంత్, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, హనుమంత రెడ్డి మాట్లాడుతూ డాక్టర్ నిఖిల్ మన మధ్య లేకపోయినా ఆయన పుట్టిన రోజు సందర్భంగా నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాల ద్వారా పేద, మధ్యతరగతి కుటుంబాలకు విద్యా, వైద్య సహాయం అందుతూ ఆయన సేవా భావం సమాజంలో నిలిచివుందని తెలిపారు. డాక్టర్ నిఖిల్ కేవలం వైద్యుడిగానే కాకుండా సింధు పార్సిల్ సర్వీసెస్ సంస్థ అభివృద్ధికి దూరదృష్టితో పునాది వేశారని పేర్కొన్నారు. ఆయన స్మారకార్థంగా స్థాపించిన ట్రస్ట్ ద్వారా ప్రతి సంవత్సరం సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు.విద్యా, వైద్య సేవలను అందిస్తూ ట్రస్ట్ సమాజానికి ఆదర్శంగా నిలుస్తోందని నిర్వాహకులు తెలిపారు.



## కళ్యాణలక్ష్మి, షాది ముభారక్ చెక్కులు లబ్ధిదారులు పంపిణీ చేసిన పోచారం

**కామారెడ్డి జిల్లా,మార్చి 01 (ప్రజాస్వరం):**

కామారెడ్డి జిల్లా బాన్సువాడ పట్టణ కేంద్రంలోని తన నివాసం వద్ద బాన్సువాడ పట్టణం, బాన్సువాడ గ్రామీణ మండలం, నసురుల్లాబాద్, బీర్కూర్ మండలాల కళ్యాణలక్ష్మి, షాది ముభారక్ లబ్ధిదారులు 178 మందికి రూ 1,78,20,648/ల చెక్కులను పంపిణీ చేసిన తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ సలహాదారులు,బాన్సువాడ నియోజక వర్గ శాసన సభ్యులు పోచారం శ్రీనివాసరెడ్డి పాల్గొన్న బాన్సువాడ పటణ,బాన్సువాడ గ్రామీణ మండల,నసురుల్లాబాద్,బీర్కూర్ మండలాల ప్రజాప్రతినిధులు,నాయకులు,అధికారులు,లబ్ధిదారులు.మండలాల వారిగా లబ్ధిదారుల వివరాలు....బాన్సువాడ గ్రామీణ మండలం 54 మంది లబ్ధిదారులకు రూ 54,06,264/ బాన్సువాడ పట్టణం 30 మంది లబ్ధిదారులకు రూ 30,03,480/నసురుల్లబాద్ మండలం 74 మంది లబ్ధిదారులకు రూ 74,08,584/ బీర్కూర్ మండలం 20 లబ్ధిదారులకు రూ 20,02,320/





# సర్కిల్ విలీనం అయ్యింది... సమస్యలు మాత్రం యథాతథం!

- ప్రజల ప్రాణాలతో ఆటలు ఆడొద్దు –బీజేపీ హెచ్చరిక
- కోట్లు ఖర్చు...గుంతలే మిగిల్చిన ప్రభుత్వం! –బీజేపీ ఫైర్

**కుత్బుల్లాపూర్ మార్చి 1 (ప్రజాస్వరం):**

నిజాంపేట్ సర్కిల్ పరిధిలోని ప్రధాన రహదారుల దుస్థితిపై ఆకుల సతీష్ టీం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. నిజాంపేట్ నుండి బాచుపల్లి, బాచుపల్లి నుండి ప్రగతినగర్, ప్రగతినగర్ నుండి జేఎన్టీయూ వరకు ఉన్న మెయిన్ రోడ్లలో దాదాపు 50 నుండి 100 ప్రాంతాల్లో భారీ గుంతలు ఏర్పడి ఉద్యోగస్తులు, వ్యాపారులు, స్థానిక ప్రజలు ప్రతిరోజూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో నిజాంపేట్ భవ్యసానంద్ సమీపంలో రోడ్డుపై ఏర్పడిన గుంతల వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. వందల కోట్లు ఖర్చు చేసినప్పటికీ కనీసం ప్రధాన రహదారులను సైతం మరమ్మతు చేయక పోవడం డిప్యూటీ కమిషనర్ నిర్లక్ష్య వైఖరికి నిదర్శనమని విమర్శించారు. గుంతల కారణంగా వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని, ట్రాఫిక్ అంతరాయం కలుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే రోడ్ల గుంతలను పూడ్చి, ట్రాఫిక్ సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాలనీల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉందని, ఎక్కడ చూసినా గుంతలే కనిపిస్తున్నాయని పేర్కొన్నారు. గుంతల కారణంగా ప్రజలు వాహనాలపై నుంచి పడిపోతున్నప్పటికీ అధికారులు స్పందించడం లేదని ఆరోపించారు. మౌలిక వసతుల కల్పనలో విఫలమైన నిజాంపేట్ డిప్యూటీ కమిషనర్‌ను తక్షణమే బదిలీ చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించే అధికారిని నియమించాలని కోరారు.










**సిఎంసిలో విలీనమైన సమస్యలు సమస్యలుగానే ఉన్నాయి**

సర్కిల్‌ను సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీనం చేసినప్పటికీ పారిశుద్ధ్యం, డ్రైనేజ్ సమస్యలు, మురికి నీరు, దోమల విస్తృతి వంటి సమస్యలు కొనసాగుతుండటం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించకపోతే ఆందోళనను మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అమలేశ్వరి, అరుణ్, వినయ్, సువాసిని శక్తి, శశి, హనుమయ్య, మురళి, ప్రసాద్, పాండు, సతీష్, ఎల్ల స్వామి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## పట్నం రాజేందర్ రెడ్డి 38 వర్ధంతి




**షాబాద్, మార్చి 01( ప్రజాస్వరం ):**

దివంగత నేత పట్నం రాజేందర్ రెడ్డి 38వ వర్ధంతి సందర్భంగా షాబాద్ పిఆర్ఆర్ఎం కళాశాలలో, గొల్లూరు గూడ స్వగ్రామంలో, ముదేం గూడా చౌరస్తాలో, షాబాద్ పిఆర్ఆర్ఎం స్టేడియంలో గల ఆయన విగ్రహాలకు ప్రభుత్వ చీఫ్ వీపు పట్నం మహేందర్ రెడ్డి, కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి, షాబాద్ మాజీ జెడ్పిటిసి సభ్యులు పట్నం అవినాష్ రెడ్డి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మహేందర్ రెడ్డి మాట్లాడుతూ... రాజేందర్ రెడ్డి పేద ప్రజల అభ్యున్నతకు పాటుపడేవాడని వారి ఆశయ సాధనకు కృషి చేస్తామని అన్నారు. నరేందర్ రెడ్డి మాట్లాడుతూ... షాబాద్ కు రోడ్లు, కరెంటు లాంటి వసతుల కల్పనకు రాజేందర్ రెడ్డి కృషి ఎంతో గొప్పదని అన్నారు. పట్నం అవినాష్ రెడ్డి మాట్లాడుతూ... మా నాన్నగారు చూపిన బాటలో నేను నడుస్తానని తెలుపుతూ ప్రతి నిత్యం ప్రజా సంక్షేమ కోసం పాటుపడతానని అన్నారు. అనంతరం గత వారం రోజుల పాటు నిర్వహించిన పట్నం రాజేందర్ రెడ్డి మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ పోటీల్లో 8 జట్లు తెలపడగా ఫైనల్లో విజేతగా నిలిచిన షాబాద్ జట్టుకు 2 లక్షల రూపాయల నగదు బహుమతి, రెండవ స్థానంలో నిలిచిన చేవెళ్ల జట్టుకు లక్ష రూపాయల నగదు బహుమతి ట్రోఫీలను అందించారు. వాలీబాల్ లో 14 జట్లు తెలపడగా మొదటి బహుమతిగా మొయినాబాద్ జట్టు కు 50,000 నగదు బహుమతి, రెండవ బహుమతి సాధించిన షాబాద్ పిఆర్ఆర్ఎం జట్టుకు 25 వేల నగదు బహుమతి ట్రోఫీలను, ప్రభుత్వ చీఫ్ వి పట్నం మహేందర్ రెడ్డి చేతుల మీదుగా అందించారు. ఈ కార్యక్రమంలో నూతన సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, రాజేందర్ రెడ్డి అభిమానులు పాల్గొన్నారు.

## బిసి రిజర్వేషన్లపై కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి ఉంటే పార్లమెంటులో ప్రవేట్ బిల్లు పెట్టాలి

- రెండు రాజ్యసభ స్థానాలు బిసి, ఎస్‌సి, ఎస్‌టి లకివ్వాలి
- రాహుల్ గాంధీకి జాజుల శ్రీనివాస్ గౌడ్ బహిరంగ లేఖ

**హైదరాబాద్ మార్చి 01(ప్రజాస్వరం):**

బిసి రిజర్వేషన్లపై కాంగ్రెస్ పార్టీకి ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా పార్లమెంటులో ప్రైవేట్ బిల్లు ప్రవేశ పెట్టాలని బిసి జెఏసి చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. రాష్ట్ర పర్యటనకు వస్తున్న రాహుల్ గాంధీకి బిసి డిమాండ్లపై శ్రీనివాస్ గౌడ్ బహిరంగ లేఖ రాశారు. ఈ సందర్భంగా జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా కులగణన జరిగి, జనాభా దామాషా ప్రకారం ఎవరి వాటా వారికి చట్టబద్ధంగా దక్కాలన్న రాహుల్ గాంధీ నినాదాన్ని, ఆచరణలో చూపించడానికి తెలంగాణ రాష్ట్రాన్ని సామాజిక న్యాయానికి ఒక మోడల్ గా చేయాలని ఆయన రాహుల్ గాంధీకి విజ్ఞప్తి చేశారు. అతి త్వరలో భర్తీ చేయబోయే రెండు రాజ్య సభ స్థానాలలో ఒకటి బిసికి, రెండవది ఎస్‌సి, ఎస్‌టిలకు కేటాయించాలని ఆయన కోరారు. రాష్ట్రానికి సంబంధం లేని వారిని, ఇప్పటికే తమ జనాభా దామాషా కంటే ప్రాతినిధ్యం ఎక్కువగా రాజకీయంగా ఉన్న అగ్రకులాలకు అవకాశం ఇవ్వకుండా బిసిలకే ఇవ్వాలని ఆయన కోరారు. కామారెడ్డి బిసి డిక్లరేషన్ లో చెప్పిన విధంగా రాష్ట్ర ప్రభుత్వం నియమించే నామినేటెడ్ పోస్టుల్లో, ప్రభుత్వ కాంట్రాక్టులలో, రాష్ట్ర బడ్జెట్ లో, అన్ని స్థాయిల్లోనూ తెలంగాణలో జరిగిన కులగణన ఆధారంగా బిసిలకు జనాభా దామాషా ప్రకారం అవకాశాలు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్రంలో లక్షలాదిమంది ఉన్నత విద్యను అభ్యసించే పేద బిసి, ఎస్‌సి, ఎస్‌టి, మైనారిటీ, ఈబిసి విద్యార్థులకు స్కాలర్షిప్ లు, ఫీజుల రియింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని రాహుల్ గాంధీ ఆదేశించాలని ఆయన కోరారు. నాగర్ కర్నూల్ జిల్లా కుమ్మెర గ్రామంలో అగ్రకుల ఆధిపత్య వర్గాల దాడిలో రెండు నెలల పసికందు మరణించిన విషయంలో రాహుల్ గాంధీ తక్షణమే జోక్యం చేసుకొని నిందితులను కఠినంగా శిక్షించేలా చర్యలు తీసుకోవాలని, బిసి కుటుంబాలను ఆదుకోవాలని, ఇలాంటి సంఘటనలు భవిష్యత్తులో జరగకుండా బిసి రక్షణ చట్టం తేవాలని జాజుల డిమాండ్ చేశారు.



## శ్రీ శైలం గాయత్రి పీఠం కన్వీనర్ గా బండ్ల బాబు నియామకం...

**వేటపాలెం ఫిబ్రవరి 28 (ప్రజాస్వరం):**

ఈనెల 26 తేదీన శ్రీశైలం మహా పుణ్యక్షేత్రములో దేవాంగ ద్వితీయ గాయత్రీ పీఠం పీఠాధిపతులు గా చల్లా రామారావు ని పడవేడు గాయత్రి పీఠం పీఠాధిపతులు శ్రీ చెన్న కోటిలింగమూర్తి స్వామి పట్టాభిషేకం చేసి నియమించడం జరిగింది. ఈ యొక్క శ్రీశైలం గాయత్రి పీఠం విశిష్టతను గురించి ఆంధ్రా ప్రదేశ్, తెలంగాణ ఒరిస్సా రాష్ట్రంలో దేవాంగ మహా జనులు ఉన్న ప్రాంతంలో పెద్దల్ని కలిసి ప్రతి ఒక్కరికీ గాయత్రి పీఠం విశిష్టతకు చెందిన సభలు, సమావేశములు నిర్వహించటానికి , ప్రతి కార్యక్రమం అన్ని రాష్ట్రాల్లో నిర్వహించే విధముగా బాధ్యతలు నిర్వహించాలని తెలియచేస్తూ శ్రీ దేవాల పరబ్రహ్మానందనాధులు ( చల్లా రామారావు ) వారు ఘనముగా సన్మానించి బాధ్యతలు ఇవ్వడం జరిగినది. స్వామి వారి అనుజ్ఞ మేరకు ఈ పదవి తీసుకోవడం జరిగింది. కావున యావత్ దేవ బ్రాహ్మణ కుల బాంధవులు అందరూ సహకారం అందించి శ్రీశైలం లో గాయత్రి పీఠం నిర్మాణం కొరకు తోడ్పడుగలరు .



## ఎన్నికల హామీలో భాగంగా బోర్ వేసిన గ్రామ సర్పంచ్ ఉప సర్పంచ్ నేరెళ్ల సావిత్రి

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, మార్చి 01(ప్రజాస్వరం):**

రంగారెడ్డి జిల్లా షాబాద్ మండల పరిధిలోని పోతుగల్ గ్రామంలో ఎన్నికల హామీల ప్రకారం, వచ్చే వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని ఉన్న చ బోరును మరమ్మతు చేసి మీరు బయటికి తీసినందుకు సర్పంచ్ పామేనా నర్సింహులకు ఉప సర్పంచ్ నేరెట్ల సావిత్రి మరియు పోతుగల్ పాలకవర్గానికి గ్రామ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు గ్రామాన్ని పచ్చదనం పరిశుభ్రతగా ఏర్పరుస్తున్నటువంటి సర్పంచ్ పామేనా నరసింహులు కు డిప్యూటీ సర్పంచ్ నేరెడ్ల సావిత్రికి పోతుగల్ గ్రామ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.





## "ఆపరేషన్ వజ్రాహార్" 16 మోటార్ సైకిళ్ళు, 2 ఆటోలు సీజ్

**చీరాల ఫిబ్రవరి 28 (ప్రజాస్వరం):**

ఆపరేషన్ వజ్రపహార్ లో భాగంగా సమాజంలో మత్తు పదార్థాలను నివారించుటకు బాపట్ల జిల్లా ఎస్పీ ఉత్తర్ల మేరకు చీరాల డిఎస్పి పర్యవేక్షణలో చీరాల రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓడరేవు గ్రామంలోని వైయస్సార్ కాలనీలో చీరాల రూరల్ సిఐ పి శేషగిరిరావు, వేటపాలెం ఎస్సై జనార్ధన్, మరియు ఈపురుపాలెం ఎస్సై చంద్రశేఖర్ సిబ్బందితో కలిసి కార్డెన్ అండ్ సెర్చ్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది . అందులో భాగంగా సరైన పత్రాలు లేని 16 మోటార్ సైకిళ్ళు మరియు 2ఆటో లను సీజ్ చేయడం జరిగింది గతంలో ఈ ప్రాంతంలో ఎక్కువగా నాటు సారా గంజాయి ప్రభావం ఉండేది ఈ క్రమంలో పాత నేరస్తుల ఇల్లన్నీ తనిఖీ చేయడం జరిగింది వారికి కౌన్సిలింగ్ కూడా చేయడం జరిగింది . ఈ సందర్భంగా ఎవరైనా మత్తు పదార్థాలు అమ్మిన కొన్న వాడిన వారి మీద కఠినంగా చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా తెలియజేశారు.

## 25 ఏళ్ల తర్వాత ఒకటైన బాల్య నేస్తాలు

- పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**శంకర్ పల్లి మార్చి 01(ప్రజాస్వరం):**

గురువు అంటే తల్లి తండ్రి దైవము ఇంతటి ప్రధ్యాన్యత గల గౌరవం కేవలం గురువులకే దక్కుతుందని నాటి ప్రాథమికొన్నత పాఠశాల బుల్కాపూరం ప్రధానోపాధ్యాయులు నాగభూషణం అన్నారు. బుల్కాపూర్ శివారులోని ట్రిబుల్ ఆర్ లో నిర్వహించారు అలాగే ఉపాధ్యాయులు ప్రభాకర్ రెడ్డి, పద్మ, శ్రీదేవి, శేషికల, క్రిష్ణ గౌండ్, పాల్గొన్నారు. 25 సంవత్సరాల తర్వాత మిమ్మల్ని కలుసుకోవడం ఈ కార్యక్రమం ఏర్పాటు చేయడం చాలా సంతోషంగా ఉంది అలాగే మీరందరు మమ్మల్ని గుర్తుపెట్టుకొని ఈ కార్యక్రమం నిర్వహించడం నిర్వహించడం చాలా సంతోషంగా ఉందని తెలియజేసారు. పూర్వ విద్యార్థులందరు కలిసి గురువులని శాలువాలతో సత్కరించడం జరిగింది. అలాగే విద్యార్థులు మాట్లాడుతు గురువులని కలుసుకోవడం మేము అందరం కలవడం గురువులని సత్కారించుకోవడం చాలా సంతోషంగా ఉంది అని నాటి జ్ఞపకాలను గుర్తుచేసుకొని ఆనందంగా గడిపారు.




## కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో
# విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

- **సీనియర్ల ర్యాగింగ్ ఆరోపణలు**

**మహబూబాబాద్ జిల్లా, మార్చి 01(ప్రజాస్వ-రం):**

గూడూరు మండలం బ్రాహ్మణపల్లి గ్రామంలోని కస్తూర్బా గాంధీ గురుకుల బాలికల పాఠశాలలో ఆదివారం ఉదయం షాకింగ్ ఘటన చోటుచేసుకుంది. 8వ తరగతి విద్యార్థిని సీనియర్ల ర్యాగింగ్ కారణంగా మనస్తాపానికి గురై, 16 ఐరన్ మాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. బొల్లెపల్లి గ్రామానికి చెందిన ఈ విద్యార్థిని పాఠశాల సిబ్బంది త్వరగా గమనించి, సమీప ఆరోగ్య కేంద్రానికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం మహబూబాబాద్ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి రిఫర్ చేశారు. ప్రస్తుతం వైద్యుల పర్యవేక్షణలో ఆమెకు చికిత్స కొనసాగుతోంది. ర్యాగింగ్ ఆరోపణలపై పాఠశాల యాజమాన్యం అంతర్గత విచారణ చేపట్టింది. తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తుండగా, స్థానికులు విద్యార్థుల భద్రత, మానసిక ఆరోగ్యంపై మరింత శ్రద్ధ వేయాలని కోరుతున్నారు. ఈ సంఘటన విద్యాసంస్థల్లో ర్యాగింగ్ నియంత్రణ, కౌన్సెలింగ్ వ్యవస్థల అవసరాన్ని మరోసారి హైలైట్ చేసింది.



## మాదిగ అమర వీరుల కుటుంబాలను
# ప్రభుత్వం ఆదుకోవాలి

- **అబ్రహం మాదిగ, జిల్లా అధ్యక్షులు మహాజన సోషలిస్టు పార్టీ - సంగారెడ్డి జిల్లా.**

**జహీరాబాద్ మార్చి 01(ప్రజాస్వరం):**

మాదిగ అమర వీరుల దినోత్సవం సందర్భంగా జహీరాబాద్ పట్టణంలోని ఐబీలో ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇంచార్జి ఉల్లాస్ మాదిగ ఆధ్వర్యంలో మాదిగ అమర వీరుల చిత్ర పటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం మహాజన సోషలిస్ట్ పార్టీ జిల్లా అధ్యక్షులు అబ్రహం మాదిగ మాట్లాడుతూ సామాజిక న్యాయం కోసం దండోరా ఉద్యమంలో పనిచేస్తూ అమరులైన కుటుంబాలను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. తరతరాలుగా అణిచివేయబడిన కులాలకు చైతన్యాన్ని అందించిన ఉద్యమం దండోరా ఉద్యమం అని కొనియాడారు. ముప్పయేండ్లుగా పద్మశ్రీ మందకృష్ణ మాదిగ నాయకత్వంలో వారి హక్కుల కొరకు వారి అస్తిత్వ పునాదులను నిర్మించుకునే చైతన్యాన్ని దండోరా ఉద్యమం అందించిందని అన్నారు. ఎమ్మార్పీఎస్ తన లక్ష్య సాధన కోసం నిర్వహించిన పోరాటంలో ఎందరో అమరులు కావడం బాధాకరం అని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యమంలో భాగంగా గాంధీ భవన్ ఘటనలో వీరమరణం పొందిన అమరులు పొన్నాల సురేందర్ మాదిగ, మహేష్ మాదిగ, దేవేందర్ మాదిగ, ప్రభాకర్ మాదిగలు మరియు పోరాటంలో వీర మరణం పొందిన తెల్లబండ్ల రవి, ఉద్యమ ప్రస్థానంలో హైదరాబాద్ కలెక్టరేట్ ముట్టడిలో ప్రాణాలర్పించిన దర్శనలా భారతి మాదిగ గార్లు వర్గీకరణ సాధనలో జీవితమంతా ఎమ్మార్పీఎస్ ఉద్యమానికి అంకితం చేసిన రాజెల్లయ్య మాదిగ తదితరులు చిరస్మరణీయులని అన్నారు. వారి త్యాగం మరువలేనిదని అన్నారు. స్వాతంత్ర్య మరియు తెలంగాణ పోరాటంలో అసువులు బాసిన అమరుల తీరుగానే మాదిగ జాతి కొరకు సామాజిక మార్పు కోసం జరిగిన అనేక ఉద్యమాలలో పాలు పంచుకొని ప్రాణ త్యాగం చేసిన మాదిగ అమరవీరుల ఆశయాలు స్మరించుకుంటున్నామన్నారు. దేశ వ్యాప్తంగా రాష్ట్ర వ్యాప్తంగా నేడు ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మార్చి 1న మాదిగ అమర వీరుల సంస్మరణ దినోత్సవం జరుపుకోవడం జరుగుతుందని అన్నారు. భవిష్యత్తులో జరగబోయే ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ అమలు, సామాజిక న్యాయం దిశగా ముందుకు సాగుతామన్నారు. సబ్బండ వర్గాలు పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ నాయకత్వంలో సామాజిక మార్పుకోసం ముందుకు అడుగులు వేస్తున్నారని పేర్కొన్నారు. ఎమ్మార్పీఎస్ ఎల్లప్పుడూ సామాజిక మార్పుకోసం నిర్విరామంగా పోరాడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మహాజన సోషలిస్ట్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు జయరాజ్ మాదిగ, జహీరాబాద్ ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు టింకు మాదిగ, మొగుడంపల్లి మండల్ ఇంచార్జి నిర్మల్ మాదిగ మరియు ఎ.బాలు మాదిగ, మధు, ఆగష్టిన్, మనోజ్, దిలీప్, పవన్, మనోజ్, నాగరాజ్, ప్రశాంత్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.



# క్రిష్ణ మోహన్ కు జాతీయ సేవా రత్న జాతీయ అవార్డు

- **జాతీయ కార్యాలయంలో అవార్డు ఎంపిక పత్రాన్ని పామెన వార్డు నాయకులు శ్రేయోభిలాషుల మధ్య అందుకున్న క్రిష్ణ మోహన్**
- **చిన్న వయసులో సేవా కార్యక్రమాలు చేస్తున్నందుకు గుర్తించిన బహుజన సాహిత్య అకాడమీ**
- **సేవకు తగిన గుర్తింపు కొనియాడిన గ్రామస్థులు**

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మార్చి 01(ప్రజాస్వరం)**

చేవెళ్ల మున్సిపల్ పరిధిలోని పామెన వార్డుకు చెందిన క్రిష్ణ మోహన్ ముదిరాజ్ చిన్న వయసు నుంచే పలు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ సమాజంలో ప్రత్యేక గుర్తింపు పొందుతున్నారు. ఆయన చేపట్టిన సేవా కార్యక్రమాలను గుర్తించి బహుజన సాహిత్య అకాడమీ వారు ప్రతిష్టాత్మక 'జాతీయ సేవా రత్న' అవార్డుకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా అకాడమీ జాతీయ అధ్యక్షులు నల్లా రాధాకృష్ణ చేతుల మీదుగా అవార్డు ఎంపిక పత్రాన్ని హైదరాబాద్‌లోని జాతీయ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో క్రిష్ణ మోహన్ ముదిరాజ్ అందుకున్నారు. ఈ సందర్భంగా నల్లా రాధాకృష్ణ మాట్లాడుతూ, సమాజంలో వివిధ రంగాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న మట్టిలో మాణిక్యాలను వెలికితీసి, వారి సేవలను గుర్తించి అవార్డులతో ప్రోత్సహించడం అకాడమీ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ఇలాంటి గుర్తింపులు మరింత యువతను సమాజ సేవ వైపు ప్రేరేపిస్తాయని అన్నారు. కాగా మార్చి 15న తిరుపతిలో నిర్వహించనున్న ఆల్ ఇండియా బహుజన రైటర్స్ కాన్ఫరెన్స్ లో అందించనున్న అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో క్రిష్ణ మోహన్ ముదిరాజ్‌కు 'జాతీయ సేవా రత్న' అవార్డును ఘనంగా ప్రదానం చేయనున్నట్లు నల్లా రాధాకృష్ణ వెల్లడించారు. సామాజిక సేవ చేయాలనే సంకల్పంతో సేవలు అందిస్తున్న వారిని బహుజన సాహిత్య అకాడమీ గుర్తిస్తూ ప్రతీ ఏటా ప్రత్యేక అవార్డుల కార్యక్రమాన్ని దేశ వ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికీ 22 దేశాల్లో కూడా బహుజన సాహిత్య అకాడమీ విస్తరించిందని ఇది హర్షించదగ్గ విషయమని పేర్కొన్నారు. అవార్డు ఎంపిక పత్రాన్ని అందుకునే కార్యక్రమంలో చేవెళ్ళ మున్సిపల్ 8 వార్డు కౌన్సిలర్ దావలగారి గోపాల్ రెడ్డి అలాగే కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎర్ర గోపాల్ లు వేదికపై జాతీయ అధ్యక్షులు నల్లా రాధాకృష్ణ తో పాటుగా వేదిక పై పాల్గొన్నారు. క్రిష్ణ మోహన్ సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించడం గొప్ప విషయమని కౌన్సిలర్ గోపాల్ రెడ్డి కొనియాడారు. ముందు ముందు సమాజంలో క్రిష్ణ మోహన్ తన సేవలు అందించాలని పార్టీలకతీతంగా పాల్గొన్న ప్రతి ఒక్కరూ కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సీనియర్ కాంగ్రెసు పార్టీ నాయకులు శ్యాం రెడ్డి, రాజేందర్ రెడ్డి, బుచ్చప్ప, విష్ణు వర్ధన్ రెడ్డి, క్రిష్ణా రెడ్డి, మల్లేష్, వరుణ్, ఎర్ర శ్రీకాంత్, నిరంజన్, వెంకటేష్, తిరుపతి, శ్రీనివాస్, శేఖర్, ఇమాన్, గణేందర్, లతో పాటు స్థానికులు, స్నేహితులు పాల్గొని అవార్డుకు ఎంపిక అయిన సందర్భంగా క్రిష్ణ మోహన్ ముదిరాజ్‌కు అభినందనలు తెలిపారు.




## సొంత ఖర్చుతో సిమెంట్ రోడ్డు మరమ్మతులు ప్రారంభించిన మహిపాల్ రెడ్డి, హనుమంత్ రెడ్డి

**శంకర్‌పల్లి, మార్చి 01(ప్రజాస్వరం):**


గ్రామ అభివృద్ధి పట్ల తమ నిబద్ధతను చాటుతూ బద్దం మహిపాల్ రెడ్డి మరియు హనుమంత్ రెడ్డి సొంత ఖర్చులతో సిమెంట్ మిక్సర్ ఏర్పాటు చేసి రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. గ్రామ ప్రజలకు సౌకర్యవంతమైన రాకపోకలు కల్పించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు క్రిష్ణ రెడ్డి, వార్డ్ మెంబర్లు మరియు గ్రామ ప్రముఖులు పాల్గొని పనులను పరిశీలించారు. గ్రామ అభివృద్ధికి ముందడుగు వేసిన నాయకులను స్థానికులు అభినందించారు. గ్రామంలో మౌలిక వసతుల అభివృద్ధికి ఇలాంటి కార్యక్రమాలు మరింత ఉపయోగపడతాయని ప్రజలు అభిప్రాయపడ్డారు.



## మరకత శివాలయంలో దివంగత నటుడు మల్లికార్జున్ రావు కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు

**శంకర్ పల్లి మార్చి 01(ప్రజాస్వరం):**

మరకత శివాలయ ప్రచార కమిటీ చైర్మన్ దయాకర్ రాజు గత నెల విశాఖపట్నం పర్యటనలో భాగంగా స్వర్గీయ సీనియర్ సినీ నటుడు మల్లికార్జున రావు కుటుంబ సభ్యులకి మరకత శివాలయానికి ఆహ్వానించడం జరిగింది. గత నెలలో ఆలయ ప్రచార కమిటీ చైర్మన్ దయాకర్ రాజు ఆహ్వానం మేరకు ఆదివారం విశాఖపట్నం నుండి వచ్చి మరకత శివాలయాన్ని దర్శించుకున్న సీనియర్ నటుడు మల్లికార్జున రావు కుమారుడు శ్రీనివాస్ వారి కోడలు లలిత స్వామివారికి ప్రత్యేక పూజలు అభిషేకం చేశారు. మరకత శివాలయంలో వీరికి ప్రచార కమిటీ చైర్మన్ దయాకర్ రాజు, ఆలయ చైర్మన్ గోపాల్ రెడ్డి, కమిటీ సభ్యుడు హనుమంతు స్వామి వారి శేష వస్త్రంతో సత్కరించి, స్వామివారి చిత్రపటాన్ని బహుకరించారు.



## యాసంగి వరి రైతులకు కీలక సూచనలు

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మార్చి 01(ప్రజాస్వరం):**

మండలంలో యాసంగి వరి పైర్లు ఎక్కువ శాతం పిలక దశలో ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి దండెం విజయచంద్ర తెలిపారు. ఈ దశలో రైతులు సరైన ఎరువులు, సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు.



**ఎరువుల వినియోగం**

నాటిన 15-20 రోజులకు రెండవ దఫాగా ఎకరానికి 30 కిలోల యూరియా వేయాలి. అదనంగా 100 గ్రాముల కార్బెండాజిమ్ 25% + మాంకోజెబ్ 50% మిశ్రమ శిలీంద్రనాశిని కలిపి బురద పొలంలో సమానంగా చల్లాలి. ఇలా చేయడం ద్వారా కాండం కుళ్లు నివారించవచ్చు.

**జింక్ లోపం నివారణ**

కొన్ని ప్రాంతాల్లో జింక్ లోపం వల్ల ఆకులపై త్రుప్పు రంగు మచ్చలు కనిపిస్తూ మొక్కల ఎదుగుదల మందగిస్తోంది. ముఖ్యంగా చౌడు భూముల్లో ఈ సమస్య అధికంగా ఉంది. నివారణకు జింక్ సల్ఫేట్ 2 గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు.

**కాండం తొలిచే పురుగు నివారణ**

యాసంగిలో కాండం తొలిచే పురుగు ఉధృతి అధికంగా ఉండే అవకాశం ఉంది. దీపపు ఎరలు, సోలార్ దీపాలు లేదా లింగాకర్షణ బుట్టలు అమర్చుకుని పురుగుల ఉధృతిని గమనించాలి. పిలక దశలో ఎకరానికి మూడు లింగాకర్షణ బుట్టలు ఏర్పాటు చేయాలి. వారానికి ప్రతి బుట్టలో 25-30 పురుగులు పడితే వెంటనే సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. నారుమడిలో గుళికలు వేయకపోతే, 20-25 రోజుల వయసున్న పైరులో కార్బోఫ్యూరాన్ 3G (10 కిలోలు) లేదా కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 4G (8 కిలోలు) లేదా క్లోరాంట్రానిలిప్రోల్ 0.4G (4 కిలోలు) ను 25 కిలోల ఇసుకతో కలిపి ఎకరానికి సమానంగా చల్లాలి.

**అగ్గితెగులు నివారణ**

అగ్గితెగులు కనిపించిన వెంటనే ఐసోప్రోథయోలెన్ 1.5 మి.లీ లేదా ట్రైసైక్లోజోల్ + మాంకోజెబ్ 2.5 గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి. ఆకుమచ్చ దశలోనే నివారణ చర్యలు తీసుకోవాలి. లేకపోతే మెడవిరుపు వచ్చే ప్రమాదం ఉంది.

**కలుపు నివారణ**

ప్రధాన పొలంలో 15-20 రోజులలోపు ఉన్న పైరులో కలుపు నివారణకు సైహలోఫాప్‌పిబ్యూటైల్ + పెనాక్సులామ్ 750-800 మి.లీ లేదా మెట్ సల్ఫ్యూరాన్ మిథైల్ + క్లోరోమ్యూరాన్ ఇథైల్ 8 గ్రాములు లేదా ఇథాక్సిసల్ఫ్యూరాన్ + ట్రయాఫామోన్ 90 గ్రాములు 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి. గడ్డి జాతి మరియు వెడల్పాకు కలుపు మొక్కల నివారణకు సైహలోఫాప్‌పిబ్యూటైల్ 300 మి.లీ 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. రైతులు పై సూచనలు పాటించి యాసంగి వరి దిగుబడిని పెంచుకోవాలని మండల వ్యవసాయ అధికారి దండెం విజయచంద్ర తెలిపారు.

## అమరవీరుల త్యాగం మరువలేనిది

**నవాబ్ పేట మార్చి 01(ప్రజాస్వరం):**

మాదిగ అమరవీరులకు నివాళి ఆదివారం నవాబుపేట్ మండల కేంద్రంలో ఎస్సీ రిజర్వేషన్లు వర్గీకరణ కోసం జరిగిన పోరాటంలో తమ విలువైన ప్రాణాలను అర్పించిన మాదిగ అమరవీరుల సంస్మరణ దినోత్సవం ప్రతి సంవత్సరం మార్చి 1న తెలుగు రాష్ట్రాల్లో నిర్వహిస్తారు ఈ సందర్భంగా ఎంఆర్పిఎస్ ఆధ్వర్యంలో అమరవీరుల సంస్కరణ దినోత్సవం నిర్వహించడం జరిగింది ఎమ్మార్పీఎస్ నవాబ్ పేట్ మండల అధ్యక్షుడు దాసరి సుధాకర్ మాదిగ మాట్లాడుతూ ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ కోసం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో జరిగిన పోరాటంలో మాదిగలు 30 సంవత్సరాల తర్వాత వర్గీకరణ సాధించుకున్న ఈ సాధనలో మాదిగ అమరవీరుల పాత్ర చాలా కీలకమైనదని వారు పేర్కొన్నారు. నాయకులందరూ కలిసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ పరిగి నియోజకవర్గ ఇన్చార్జ్ గుట్ట కింది రవి కుమార్ మాదిగ పూడూరు మండలం అలాగే వికారాబాద్ మండలం ఇన్చార్జి చిట్టిగిద్ద కిష్టయ్య మాదిగ, మాజీ సర్పంచ్ రత్నం, డైరెక్టర్ అంజయ్య, రిపోర్టర్ రత్నం, రవీందర్ రెడ్డి, చంద్రయ్య, రాంచెంద్రయ్య, శ్రీనివాస్, నర్సింలు, దుర్గ ప్రసాద్, ఎమ్మార్పియస్ మండల అధ్యక్షులు దాసరి సుధాకర్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.



## మద్యం మత్తులో డ్రైవింగ్ .. ట్రాఫిక్ కానిస్టేబుల్ పై దూసుకెళ్లిన కారు

**హైదరాబాద్ మార్చి 01(ప్రజాస్వరం):**

హైదరాబాద్‌లోని గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం నగరంలో తీవ్ర కలకలం రేపింది. మద్యం మత్తులో బెంజ్ కారు నడుపుతున్న ఒక వ్యక్తి విధుల్లో ఉన్న ట్రాఫిక్ కానిస్టేబుల్‌పైకి దూసుకెళ్లాడు. ఈ సంఘటన గచ్చిబౌలి ప్రాంతంలో చోటుచేసుకుంది, అక్కడ ఒక కారు డ్రైవర్ నిర్లక్ష్యంగా వ్యవహరించాడు. వివరాల్లోకి వెళితే, మద్యం సేవించి వాహనం నడుపుతున్న డ్రైవర్, ట్రాఫిక్ నియంత్రణ విధుల్లో ఉన్న కానిస్టేబుల్‌ను ఒక్కసారిగా ఢీకొట్టాడు. ఈ ఢీకొనడంతో కానిస్టేబుల్ బెంజ్ కారు బానెట్‌పై పడిపోయాడు. అయితే, డ్రైవర్ కారును ఆపకుండా, కానిస్టేబుల్ బానెట్‌పై ఉన్నప్పటికీ అలాగే డ్రైవింగ్ కొనసాగించాడు. ఈ దృశ్యం చూసిన స్థానికులు తీవ్ర ఆందోళన చెందారు. వారు వెంటనే స్పందించి, ప్రమాదకరంగా వెళ్తున్న కారును ఆపడానికి ప్రయత్నించారు. వారి సహాయంతో వాహనం కొంత దూరం వెళ్లిన తర్వాత ఎట్టకేలకు నిలిచిపోయింది.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY PURAM MAHESHWAR PRINTED AT HARI HARA ART PRINTERS, H.NO. 6-185, TOOPRAN, DIST. MEDAK, TELANGANA-502036. AND PUBLISHED AT H.NO. 4-50/18, KALLAKAL, VILL-KALLAKAL,(PO), KALLAKAL, (M) MANOHARABAD, DIST, MEDAK, TELANGANA-502036.
EDITOR : PURAM MAHESHWAR. RNI NO : TELTEL/2006/17154, CELL : 8008609999